www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మంచిర్యాల

బుధవారం 30-8-2017



20

చెరువే అన్నదాతకు ఆదరవు. అలాంటి చెరువుకు నీటి కరువొచ్చింది. జిల్లాలో మొత్తం 952 చెరువులుండగా, వర్షాభావ పరిస్థితులతో కేవలం ఆరు చెరువులు మాత్రమే పూర్తిస్థాయిలో నిండినట్లు అధికారగణాంకాలు చెబుతున్నాయి. ఏకంగా 766 చెరువులు 25శాతం నీటికే పరిమితమయ్యాయి. 128 చెరువులు 25 నుంచి 50శాతం, 47 చెరువులు 50 నుంచి 75శాతం నిండగా, మరో ఐదుచెరువుల్లోకి 75 నుంచి 100శాతం లోపు నీరు చేరింది. దీంతో ఆయా చెరువుల కింద ఆయకట్టులో 30శాతం మాత్రమే సాగులోకి వచ్చింది. ఆగస్టు 29వరకు సాధారణం కంటే 34శాతం లోటువర్షపాతం నమోదుకావడం, ఇప్పటికే అదునుదాటిపోవడంతో రైతాంగం క్రమంగా సాగుపై ఆశలు వదులుకుంటున్నది.

9

◆ ఆంధ్రజ్యోతి, మంచిర్యాల

జిల్లాలో మొత్తం చెరువులు	952
25శాతం నిండినవి	766
25-50శాతం మధ్య	128
50-75శాతం మధ్య	47
75-100శాతం మధ్య	5
చెరువుల కింద ఆయకట్టు	84వేల ఎకరాలు
సాగైన భూమి	సుమారు 30శాతం

చెరువుకు కరువు!

- జిల్లాలో 100శాతం నిండిన చెరువులు కేవలం 6శాతమే!
- 766 చెరువుల్లో నేటికీ 25శాతమే నీళ్లు
- సగానికి పైగా సాగులోకి రాని వ్యవసాయభూములు
- అంతంతే వర్షాలు
- ఆశలు వదులుకుంటున్న అన్నదాతలు



మందమర్రి మండలంలో 25 శాతం కూడా నిండని కుర్మపల్లి చెరువు



క్రీడాకారులకు అన్ని వసతులు కల్పిస్తాం

- కలెక్టర్ ఆర్వీ కర్ణన్
- జిల్లాకేంద్రంలో ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవం

7

ప్రైవేట్‌కు దీటుగా

ప్రభుత్వ విద్య

- రాష్ట్రంలో పాఠశాల, కళాశాల భవనాల నిర్మాణానికి రూ.325 కోట్లు
- తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు
- రైతులకు గిట్టుబాటు ధర కోసమే సమన్వయ కమిటీలు
- డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి
- జన్నారం, కాసిపేట మండల కేంద్రాల్లో పర్యటన

20



జన్నారంలో కళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం



జిల్లాకు 2,54,916 బతుకమ్మ చీరలు

- ఆడ బిడ్డలకు 'సద్దుల' కానుక
- సిరిసిల్ల, సూరత్ నుంచి రాక
- లబ్ధిదారుల ఎంపిక పూర్తి
- రేషన్ డీలర్ల ద్వారా పంపిణీ

జిల్లాకు 2 లక్షలా 54వేల 916 బతుకమ్మ చీరలు రానున్నాయి. సద్దుల బతుకుమ్మ కానుకగా సర్కారు, ఆడబిడ్డలకు అందజేయనుంది. రేషన్‌కార్డుల ఆధారంగా పేద, మధ్యతరగతి మహిళలను ఇప్పటికే గుర్తించగా, సెప్టెంబర్ నెలలో పంపిణీకి అధికారయంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది.

◆ ఆంధ్రజ్యోతి, మంచిర్యాల

9

ఇంటర్వ్యూ

I.N.T.E.R.V.I.E.W

హరితహారంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపుతాం

- ప్రభాకర్, మంచిర్యాల జిల్లా అటవీ శాఖ అధికారి



మందమర్రి : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన హరితహారంలో జిల్లాను ప్రథమస్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంచిర్యాల జిల్లా అటవీశాఖ అధికారి ప్రభాకర్ స్పష్టం చేశారు. మొక్కల పెంపకంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నామన్న ఆయన, రహదారుల మొదలుకొని కళాశాలలు, పాఠశాలల్లో, ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటిస్తున్నామని వివరించారు. ఈమేరకు 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో మూడోవిడత హరితహారం కింద ఇప్పటివరకు ఎన్ని మొక్కలు నాటారు?

అధికారి : ఇప్పటికి 76 లక్షలకుపైగా మొక్కలు నాటాం దీనిలో బర్డ్‌ప్లాంటేషన్ కింద 15 లక్షలు, కమ్యూనిటీ భూముల్లో 10 లక్షలు, రహదారుల వెంట 2 లక్షలు, అడవిలో 25 లక్షలు, సింగరేణి ప్రాంతంలో 25 లక్షల మొక్కలను నాటాం. వాటి సంరక్షణకు సంబంధించి మా సిబ్బంది ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా ఉన్నందున నాటిన ప్రతి మొక్కా బతికే అవకాశాలున్నాయి.

ఆంధ్రజ్యోతి : మూడేళ్లలో ఎన్ని మొక్కలు నాటారు?

అధికారి : ఈ మూడేళ్లలో కోటీ 28 లక్షల 50వేల మొక్కలను నాటాం. పాఠశాలల్లో విద్యార్థులు మొక్కలు నాటడంతో పాటు హరితటీంలను ఏర్పాటు చేసి వాటిని సంరక్షిస్తుండడం విశేషం. హరితహారం వల్ల ప్రతి ఒక్కరికీ మొక్కల పెంపకంపై ఆసక్తి పెరిగింది. భావితరాల బాగుండాలంటే చెట్లు ఉండాలనే అభిప్రాయానికి వస్తున్నారు. చెట్ల నరికివేత కూడా తగ్గుతున్నది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అడవుల సంరక్షణకు అనేక చర్యలు తీసుకుంటున్నది. అడవుల్లో కూడా మొక్కలు నాటి పెంచుతున్నాం. హరితహారం కార్యక్రమంలో అటవీ సిబ్బంది, ప్రజలు, ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

ఆంధ్రజ్యోతి : గాంధారి వనం అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి : జిల్లాకే తలమానికమైన గాంధారివనం అభివృద్ధికి అన్నివిధాలా కృషి చేస్తున్నాం. ఈ వనంలో వివిధ అటవీ జాతులు, ఔషధ మొక్కలు పెంచుతున్నాం. నక్షత్ర వనాలు, పూల తోటలు సాగుచేస్తున్నాం. వనాన్ని సందర్శించే పర్యాటకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ఆహ్లాదకరంగా గడిపేందుకు బోటింగ్ సౌకర్యం కూడా కల్పించాం. వాకింగ్ ట్రాక్‌తో పాటు జింకల పార్కు ఏర్పాటు చేశాం. వనభోజనాలకు సంబంధించి కూడా పార్కులో ప్రత్యేక వసతులు కల్పించాం. దీని వల్ల రోజురోజుకూ వనానికి సందర్శకుల తాకిడి పెరుగుతున్నది.

ఆంధ్రజ్యోతి : చెట్లను నరికితే ఎలాంటి శిక్షలు ఉంటాయి?

అధికారి : మొక్కలు మానవాళి మనుగడకు ఆధారం. వృక్ష సంపద బాగుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. పర్యావరణ పరిరక్షణ కూడా సాధ్యమవుతుంది. టేకు చెట్లు నరికితే జైలు శిక్ష ఉంటుంది. అదే విధంగా వివిధ రకాల చెట్లు నరికితే వివిధ సెక్షన్ల కింద అపరాద రుసుము విధిస్తున్నాం. అటవీ చట్టాలనుదృష్టిలో పెట్టుకొని ఎవరూ కూడా చెట్లను నరకవద్దు.

ఎన్ఎంఆర్ కార్మికుల జాబితాపై..

తొలగని ప్రతిష్టంభన !

- అనర్హులకు చోటు కల్పించారనే ఆరోపణలు
- నేడు మున్సిపల్ పాలకవర్గం ఆమోదం కోసం ప్రతిపాదనలు
- కలెక్టర్‌కు ఫిర్యాదుతో రసవత్తరంగా మారిన రాజకీయం

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో గత కొన్నేళ్లుగా పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న నాన్ మాస్టర్ రోల్(ఎన్ఎంఆర్) కార్మికుల జాబితాపై ప్రతిష్టంభన ఇంకా తొలగడం లేదు. రెండేళ్ల క్రితం అన్ని మున్సిపాలిటీల్లో పని చేస్తున్న ఎన్ఎంఆర్ కార్మికుల జాబితాను పంపించాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఈమేరకు కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్ కార్మికులతో కూడిన జాబితాను పంపించారు. ఈ జాబితాలో అనర్హులకు స్థానం కల్పించి, అర్హులకు మొండి చేయి చూపారని ఆరోపిస్తూ మున్సిపల్ వైస్‌చైర్మన్ సద్దాం హుస్సేన్, కౌన్సిలర్లు జానీమియా, వసీమున్నీసాతో పాటు తదితరులు గత పాలక వర్గ సమావేశంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. తాజాగా సోమవారం కూడా ఎన్ఎంఆర్ జాబితాపై సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని కలెక్టర్ చంపాలాల్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో ఏ నిబంధనల ప్రకారం జాబితా రూపొందించారు? అర్హులకు న్యాయం జరిగిందా? అనే అంశాలపై నిగ్గు తేల్చాల్సి ఉంది. మంగళవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో కూడా పాలక వర్గ సభ్యులు ఆమోదం పొందేందుకు కూడా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఇప్పుడు కాగజ్‌నగర్‌లో ఈ సమస్య హాట్‌టాపిక్‌గా మారింది.

● అంతా వివాదాస్పదం..

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ఎన్ఎంఆర్ జాబితా రూపకల్పన ఆది నుంచీ వివాదాస్పదమవుతున్నది. వాస్తవంగా 19 మంది ఎన్ఎంఆర్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో నిబంధనల ప్రకారం అర్హతలున్నవారిని కాకుండా అనర్హులకు చోటు కల్పించారని గతేడాది జనవరిలో జరిగిన సర్వసభ్య సమావేశంలో దుమారం చెలరేగింది. ఈ జాబితాకు సంబంధించి మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త సీపీ రాజ్‌కుమార్‌పై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని చైర్‌పర్సన్ నడుపరాదని సభ్యులు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. దీంతో మున్సిపల్ అధ్యక్షురాలు అర్ధంతరంగా సమావేశం నుంచి వెళ్లిపోయారు.ఆ తర్వాత మళ్లీ ఈ సమస్య తెరమీదకు రాలేదు. తాజాగా రాష్ట్రంలో అన్ని మున్సిపాల్టీల నుంచి పాలకవర్గం ఆమోదం అనంతరం జాబితాలు ప్రభుత్వానికి చేరాయి. కానీ కాగజ్‌నగర్ నుంచి మాత్రం వెళ్లలేదు. దీంతో మంగళవారం జరిగే సర్వసభ్య సమావేశంలో ఎలాగైనా జాబితాను ఆమోదించేలా చూడాలని అధికారులు భావిస్తున్నారు.



ఎన్ఎంఆర్ జాబితాపై విచారణ జరుపాలని వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు (ఫైల్)

● ఏదీ పారదర్శకత...

ఎన్ఎంఆర్ కార్మికుల జాబితాపై అనుసరిస్తున్న వైఖరి అనుమానాలకు తావిస్తున్నది. సీనియార్టీ ప్రతిపాదకన కేవలం ఎనిమిది మందిని మాత్రమే ప్రభుత్వం పర్మినెంట్ చేస్తుంది. ఈమేరకు కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కూడా సీనియార్టీ ప్రకారం ఎనిమిదిమందితోనే జాబితా రూపొందించింది. ఇప్పటికే ముగ్గురు ఎన్ఎంఆర్ కార్మికులు చనిపోగా, ముగ్గురు విరమణ పొందారు. వీరు పోగా తాజా జాబితాలో అనర్హులకు పెద్దపీట వేశారనే ఆరోపణలున్నాయి.

జాబితాపై స్పష్టత లేదు...

- వసీమున్నిసా, 20 వార్డు కౌన్సిలర్, కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మున్సిపాలిటీ తయారుచేసిన ఎన్ఎంఆర్ కార్మికుల జాబితాలో స్పష్టత లేదు. అనర్హులకు చోటు కల్పించారు. చనిపోయిన వారి పేర్లు, ఉద్యోగ విరమణ పొందిన వారి పేర్లను కూడా పంపి వారి స్థానాల్లో ముడుపులిచ్చిన వారికి అవకాశం కల్పించారు. దీంతో అర్హులకు పూర్తిగా అన్యాయం జరిగింది. ఈ విషయంలో నేరుగా జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేశాం. న్యాయం జరిగేంత వరకు పోరాటం తప్పదు. చివరకు న్యాయ స్థానాన్ని కూడా ఆశ్రయించి నియామకంపై స్టే తెచ్చేందుకు కూడా వెనుకాడబోం.

గతంలోనే ఫిర్యాదు చేశాం..

- జానిమీయా, 8వవార్డు కౌన్సిలర్, కాగజ్‌నగర్



ఎన్ఎంఆర్ జాబితాలో పూర్తి స్థాయిలో అక్రమాలు జరిగాయని లిఖిత పూర్వంగా గతంలోనే ఫిర్యాదు చేశాం. అయినప్పటికీ అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదు. ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేశాం. ఇప్పటికైనా పట్టించుకోకపోతే ఉద్యమిస్తాం. అర్హులైన ఎన్ఎంఆర్ కార్మికులకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతాం.

ఆధ్యాత్మికం

గూడెం ఆలయంలో ప్రత్యేక పూజలు..



కొలువుదీరిన శ్రీ సత్యదేవుడు

- గూడెం శ్రీసత్యనారాయణస్వామి దేవాలయంలో ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు సుప్రబాతం, ఆరాధన, బాలబోగము.
- ఉదయం 7 గంటల నుంచి ధర్మదర్శనము, స్వామి తీర్థప్రసాదం వితరణ అర్చకుల పూజలు
- మధ్యాహ్నం 12:15 గంటలకు స్వామివారికి మహా నివేదన, హారతి, మంత్రపుష్పం.
- గూడెం దేవస్థానాన్ని మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు మూసివేస్తారు.
- ఆ సమయంలో ఆలయ కౌంటర్లు, కార్యాలయాలు కూడా మూసి ఉంటాయి.
- సాయంత్రం 6 గంటల నుంచి స్వామి వారికి బోగము, హారతి, మంత్రపుష్ప నివేదన.
- రాత్రి 7 గంటల సమయంలో గూడెం ప్రధానాలయం మూసివేస్తారు.

శ్రీసత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు ఇలా..

- శ్రీ సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాల మొదటి బ్యాచ్ ఉదయం 9 గంటలకు, రెండో బ్యాచ్ ఉదయం 11గంటలకు, మూడో బ్యాచ్ సాయంత్రం 3.30 గంటల నుంచి నిర్వహిస్తారు. వ్రతం ఆచరించే భక్తులు పూలు పండ్లు, కొబ్బరికాయలు, మంగళహరతిప్లేటు, మాణిక్యాలు, చెంబు, గ్లాస్‌ను వెంటతెచ్చుకోవాల్సి ఉం టుంది. మిగిలిన సామూహిక వ్రత పూజా సామగ్రి ఆలయంలోనే అందజేస్తారు.

Employee Voice

ఉద్యోగి వాయిస్

ఉపాధ్యాయ బదిలీలు వెంటనే చేపట్టాలి

- ఎస్ కొండయ్య, డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు



శ్రీరాంపూర్ : ఉపాధ్యాయ, ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్లు వెంటనే చేపట్టాలి. రెండేళ్లుగా బదిలీలు, ఉద్యోగోన్నతులు లేక టీచర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. మానసిక వేదనకు గురవుతున్నారు. భార్యభర్తలు ఒకే ప్రాంతంలో కలిసి పనిచేసే అవకాశాన్ని కోల్పోతున్నారు. ఉద్యోగోన్నతులు లేకపోవడం వల్ల వేలాది మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ అనంతరం ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం ఓవైపు బంగారు తెలంగాణ నిర్మాణం అంటూ, మరోవైపు ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పట్టకుండా వ్యవహరించడం తగదు. ఉద్యోగోన్నతులు, బదిలీల వల్ల మారుమూల ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఎంతో మేలు చేసినట్లవుతుంది. అలాగే పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరుతుంది. జిల్లాల్లో ఇప్పటికే అనేక ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు లేక ఇన్‌చార్జిలతోనే నడిపిస్తున్నారు. తద్వారా పాఠశాలల నిర్వహణ గాడితప్పుతున్నది. కనుక విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వెంటనే ఉద్యోగోన్నతులు, బదిలీలు చేపట్టాలి. ఉమ్మడి జిల్లా పరిధిలోని మారుమూల పాఠశాలల్లో రెండేళ్లుగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కాకపోవడంతో విద్యావలంటీర్లతోనే నెట్టుకొస్తున్నారు. దీంతో నాణ్యమైన విద్య అందడం లేదు. వెంటనే డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి.

ఐదు రోజుల పసికందు మృతి

● వైద్యుల నిర్లక్ష్యం వల్లే చిన్నారి మృతి చెందిందని తల్లిదండ్రుల ఆరోపణ



పసికందు మృతదేహం

మంచిర్యాల రూరల్ : జైపూర్ మండలం రామారావుపేటకు చెందిన జాడి మల్లేష్ - పద్మలకు జన్మించిన ఐదు రోజుల శిశువు మృతి చెందిన ఘటన మంచిర్యాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చోటుచేసుకుంది. బాధిత తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. గర్భంలో ఉన్న శిశువు ఆరోగ్యంగానే ఉందని వైద్యులు పలుమార్లు స్కానింగ్ చేసి తెలిపారు. కాని శిశువు గుండెకు రెండు రంధ్రాలతో జన్మించిందని, చిన్నారిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించాలని వైద్యులు సూచించినట్లు బాధితులు తెలిపారు. గర్భంలో ఉన్న శిశువు అనారోగ్యంగా ఉన్నప్పటికీ వైద్యులు తెలపలేదన్నారు. ఐదు నెలల సమయంలో పాప గుండెకు సంబంధించిన వివరాలను సక్రమంగా పని చేస్తుందా లేదా అనే విషయం చెప్పకపోవడం వల్లనే ఈ దుస్థితి నెలకొందని రోదిస్తూ తెలిపారు.

చిన్నారి జన్మించిన తరువాత సుమారు 2 లక్షలకు పైగా ఖర్చు చేసినప్పటికి పాప తమకు దక్కలేద న్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కాగా మల్లేష్ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

● హత్యేనంటూ బంధువుల ఆందోళన

చెన్నూర్: మండలంలోని దుగ్నెపల్లి గ్రామానికి చెందిన గంద్రకోట కుమార్(20)అనే యువకుడు మంగళవారం సమీపంలోని పంటచేలలో అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. బంధువులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. కుమార్ తలిదండ్రులు మల్లయ్య, గట్టక్కలు గ్రామంలో మంత్రాలు చేస్తున్నారన్న నెపంతో సమీప బంధువులైన గంద్రకోట అనిల్, ఆశోక్, లింగయ్య, రాజన్న, లక్ష్మి, స్వరూపలతో గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. కాగా సోమవారం ఇరు వర్గాల మధ్య తారా స్థాయిలో గొడవలు జరిగాయి. అయితే రాత్రి సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లిన కుమార్ అర్ధరాత్రి వరకు ఇంటి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. మంగళవారం ఉదయం కుమార్ అచూకీ కోసం గాలించగా చెల్లాయిపేట గ్రామ సమీపంలోని పంట చేలలో శవమై కనిపించడంతో కుటుంబ సభ్యులుసభ్యు రోదనలు మిన్నంటాయి.

సంఘటనా స్థలం వద్ద క్రిమీసంహారక మందు డబ్బా పడి ఉండడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించి తమ కుమారుడు గొడవల మూలంగా తీవ్ర మనస్థాపానికి గురై క్రిమిసంహారక మందు త్రాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనా స్థలం వద్ద పంచనామా నిర్వహించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం సమయంలో కుమార్ వద్ద ఎలాంటి క్రిమీ సంహారక మందు వాసన రాకపోవడంతో కుటుంబ సభ్యులు తమ కుమారున్ని హత్య చేశారని ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. తమ కుమారున్ని కక్షలతోనే హతమార్చారని విలేకరుల ఎదుట వాపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని దుగ్నెపల్లికి తరలించారు. బందువుల రోదనలతో ఆస్పత్రి వద్ద విషాద చాయలు అలుముకున్నాయి.



ఆస్పత్రి ఎదుట రోదిస్తున్న బంధువులు



మృతి చెందిన కుమార్

వ్యాపారి ఇంట్లో చోరీ

● 7 తులాల బంగారం, 32 తులాల వెండి అపహరణ

మంచిర్యాల క్రైం : మంచిర్యాల పట్టణంలోని రెడ్డి కాలనీకి చెందిన బట్టల వ్యాపారి గండిశెట్టి సతీష్ ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై ఆకుల అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సతీష్ కొంత కాలంగా రెడ్డి కాలనీలోని వేణుగోపాల్‌రావు ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. సతీష్ కుటుంబ సభ్యులతో కలిసి నిజామాబాద్‌లోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉద యం ఇంటి యజమాని వేణుగోపాల్‌రావు సతీష్ ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించి ఫోన్ ద్వారా వారికి సమాచారం అందించాడు.

బీరువాలోని 7 తులాల బంగారు ఆభరణాలు, 32 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ. 15 వేలు నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆకుల అశోక్ తెలిపారు.

మంచిర్యాల ఇన్‌చార్జి ఏపీపీగా రవీందర్

మంచిర్యాల క్రైం : మంచిర్యాల ప్రిన్సిపల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జిగా ఊట్నూర్ కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న నంది రవీందర్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఊట్నూర్ కోర్టులో పూర్తి స్థాయి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేస్తున్న రవిందర్ మంచిర్యాల ప్రిన్సిపల్ ఫస్ట్ క్లాస్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఎఫ్‌ఏసీగా వారానికి రెండు రోజులు విధులు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు అయనను అభినందించారు.

గిరిజన విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ

మంచిర్యాల రూరల్: హాజీపూర్ మండలంలోని రాంపూర్ శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో మంగళవారం స్వచ్ఛంద సేవా సంస్థ లక్షెట్టిపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆవాస విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ గవర్నర్ ఇబ్రహీం మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళిక బద్దంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. వైద్య పరంగా, సామాజిక పరంగా రోటరీ క్లబ్ అనేక సేవలు అందిస్తుంద ని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు బొసెట్టి చంద్రగుప్త, నిరంజన్, హనుమంతరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, రావుల రామన్న, తదితరులు పాల్గొన్నారు.

హరితహారం పథకంపై కళాజాత ప్రదర్శన

దండేపల్లి: మంచిర్యాల జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ సాంస్కృతిక సారధి అధ్వర్యంలో తెలంగాణ హరితహారం పథకం కార్యక్రమంలో భాగంగా దండేపల్లి మండలం వెల్గనూర్ ప్రభుత్వ జెడ్పి ఉన్నత పాఠశాలో, గ్రామంలోని మంగళవారం సారధి కళాకారులు మమిళ్ల లక్ష్మణ్, ముల్కల్లా మురళి అధ్వర్యంలో మూడో విడుత హరితహారం పథకంపై కళాజాత ప్రదర్శన ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ఆటాపాటలతో నృత్యాలు చేస్తు దినదినం దేశంలో కాలుష్యం పెరిగిపోతుందని దానిని నివారించలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను ఒక విధిగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలను నాటినే మానవళీకి మనుగడ ఉంటుందన్నారు. అనంతరం చెట్ల ప్రాముఖ్యతపై కళాకారులు మమిళ్ల లక్ష్మణ్, ముల్కల్లా మురళి, శీరిష, నాగలక్ష్మి , లచ్చన్న, శ్రీనివాస్, రమేష్, శ్రావణ్ కళాజాత ప్రదర్శన ద్వారా విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒకరు హరితహారం పథకంలో బాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యాక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సప్ధర్ ఆలీ, ఎప్‌ఎస్‌వో రాము, ఎప్‌బివో కృష్ణరావు ఉన్నారు.

ఎంఆర్ టీకాలు తప్పనిసరిగా వేయించాలి

దండేపల్లి: ఎంఆర్ వ్యాక్సిన్ టీకాల పిల్లలందరికి తప్పని సరిగా వేయించాలని దండేపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు గోళ్ల మంజుల అన్నారు. దండేపల్లిలో మంగళవారం స్థానిక ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడి కేంద్రం, కొండాపూర్‌లో అంగన్‌వాడి కేంద్రంలో విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ టికాలను వైద్య సిబ్బంది వేశారు. ఈసందర్భంగా ఎంపిపి మంజుల మాట్లాడుతూ ఎంఆర్ టీకాల వ్యాక్సిన్ సెప్టెంబర్ 25 వరకు కొనసాగుతోందన్నారు. రుబెల్లా సోకిన మహిళకు పుట్టబోయే శిశువుకు జనన లోపాలు ఏర్పాడే అవకాశం ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడిలు అనసూర్య, కళావతి, సుజాత, భాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

మంచిర్యాల క్రైం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పిడుగు రాంమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా తెలుగు విభాగం యువకల సాహితి సమితి ఆద్వర్యంలో నిర్వహించారు. విద్యార్దులు పలు పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబరిచారు. సాంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా విద్యార్దులు ఆట పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జయకిషన్, సంస్థ వ్యవస్దాపకులు రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: దండేపల్లి మండలం లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలో తెలుగు బాషా దినోత్సవాన్ని విద్యార్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆదర్శ పాఠశాలో విద్యార్థులు నాటిక ప్రదర్శన, ఆటపాటలు నృత్యాలు, ఉపన్యాసం, పద్యాల పోటిలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జీ ప్రిన్సిపల్ చైతన్య స్రవంతి, తెలుగు ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, సుజాత, నరేష్, ఉపాద్యాయులు ఉన్నారు.

మండల స్థాయి కబడ్డీ పోటీలు

జన్నారం: మండలంలోని ప్లేట్ పాఠశాలలో మంగళవారం ఏనుగు లింగారెడ్డి స్మారకార్థం కబడ్డీ పోటీలను నిర్వహించారు. డీఈఓ రవికాంత్ మొదటగా క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. మొదటి రోజు క్రీడల్లో సెమీఫైనల్స్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్బంగా డీఈఓ రవికాంత్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడలు మానసిక ఉల్లాసాన్ని నింపుతాయన్నారు. క్రీడల వల్ల విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీకాంత్‌రెడ్డి, యాజమాన్యం సుబాష్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారి కట్ట రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ

దండేపల్లి: స్వచ్ఛ భారత్ పథకం ద్వారా మూడో విడత ఓడిఎఫ్ కింద ఎంపికైన దండేపల్లి మండలం నాగసముద్రం, మాకులపేట, తాళ్లపేటలో మంగళవారం సర్పంచులు రేణు యశోధ, కోమురం లింగారావులు మరుగుదొడ్డు నిర్మాణ పనులకు భూమి చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మరుగుదొడ్డలు లేని వారి తప్పని సరిగా వ్యక్తగత మరుగుదొడ్డు నిర్మించుకోవాలన్నారు. ప్రతి ఇంటింటికి మరుగుదొడ్డులు నిర్మించుకుంటే వారికి ప్రభుత్వం డబ్బులను అందజేయడం జరుగుతుందన్నారు. నాగసముద్రంలో 40, మాకులపేటలో 30 మరుగుదొడ్డు నిర్మాణంకు భూమి పూజ చేశారు. ఈకార్య క్రమంలో నాగసముద్రం మాజీ సర్పంచు రేణు శ్రీనివాస్, ఉపసర్పంచు రాజగోపాల్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

జన్నారం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. మంగళవారం జన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిక ప్రతి మొక్కను కాపాడుకోవాలన్నారు. రాష్ట్రాన్ని హరితవనంగా మార్చేందుకు హరితహారం కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతుగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. రాష్ట్రంలో ఈ సంవత్సరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఇచ్చిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి సైతం మొక్కను నాటే విధంగా ఉపాధ్యాయలు, అధ్యాపకులు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో మొక్కలు నాటాలని పూర్తిస్థాయిలో ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మొక్కలు నాటడం పట్ల అశ్రద్ధ వహిస్తే చర్యలు తీవ్రతరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పురాణం సతీష్, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు మండల టీఆర్‌ఎస్ నాయకులు రాజంరాంరెడ్డి, జాడి గంగాధర్, అనసూయ మల్లేష్, సత్యం, జనార్దన్ మండల నాయకులు పాల్గొన్నారు.


డిప్యూటీ సీఎంకు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల పిల్లలకు ఉచితవిద్య అందించాలని వినతి

రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలని కోరుతూ మండల టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరికి మంగళవారం విలేకరులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నర్సయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో ప్రతి జర్నలిస్టులు తెలంగాణ ఉద్యమంలో తన వంతు ప్రత్యక్ష ఉద్యమం చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత వారి కుటుంబాలను టీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని, చెప్పిన మాటలను గుర్తు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. వారి పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. అంతే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రతి విలేకరికి అక్రిడిటేషన్లు అందజేయాలని కోరారు. అదేవిధంగా డబుల్‌బెడ్‌రూం ఇండ్లను కేటాయించాలని విన్నవించారు. ఆయన వెంట ప్రధాన కార్యదర్శి రమేష్, నాయకులు కిరణ్, ప్రశాంత్, పవన్, మల్లేషం, సతీష్, శ్రీనివాస్, సత్యం పాల్గొన్నారు.

'ప్రేమ్‌సాగర్‌రావ్‌పై చేసిన ఆరోపణలను రుజువు చేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

లక్షెట్టిపేట: మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావ్‌పై టీఆర్‌ఎస్ నాయకులు చేసిన ఆరోపణలను దమ్ముంటే రుజువు చేయాలని లక్షెట్టిపేట కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే దివాకర్‌రావ్ అక్రమ భూములపై తక్షణమే న్యాయ విచారణకు ప్రేమ్‌సాగర్‌రావ్ కోరడంతో ఎమ్మెల్యే బెంబేలెత్తిపోయారన్నారు. ఎమ్మెల్యే తన అనుచర గణంతో ప్రేమ్‌సాగర్‌రావ్‌పై లేనిపోని అబాండాలు వేయించడం ఎంత వరకు సబబన్నారు. ఆపదలో వున్న కుటంబాలకు ప్రేమ్‌సాగర్‌రావ్ నగదు ఆర్థిక సాయం అందజేయడాన్ని జీర్ణించుకోలేని ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అదేవిదంగా లక్షెట్టిపేట మండలం టీఆర్‌ఎస్ నాయకుడు పోడేటి శ్రీనివాస్‌గౌడ్ తన తండ్రి పేరున చారిటబుల్ ట్రస్ట్‌ని ఏర్పాటు చేస్తే అది ఎమ్మెల్యే దివాకర్‌రావ్ వచ్చి ప్రారంబించడం ఎంత వరకు సమంజసమో ఆలోచించుకోవాలన్నారు. సదరు టీఆర్‌ఎస్ నాయకుడు మోదెల శివారులో గల కాకుల గుట్ట తన స్వంత ఆస్తిగా భావించి మట్టిని అభివృద్ధి పేరిట అమ్ముకోవడం నిజం కాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే, ఆయన అనుచరులు చేస్తున్న పలు అవినీతి కార్యక్రమాలపై ఉన్నతాధికారులచే విచారణకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్త వెంకటేశ్వర్లు, కలాల రమేశ్, మండల నాయకులు వెంకటస్వామిగౌడ్, చింతా అశోక్, పెండెం రాజు, రాందేని వెంకటేశ్, రంజాన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

నస్పూర్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని నస్పూర్ మండలం హౌజింగ్ బోర్డు కాలనీలోని మార్టిన్స్ గ్రామర్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ధ్యాన్‌చంద్ గొప్పతనం గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సబియా సుల్తానా వివరించారు. కార్య క్రమంలో వైస్ ప్రిన్సిపల్ వసీం రాజా, పాల్గొన్నారు.

మట్టి వినాయకులే శ్రేష్ఠం...

మంచిర్యాల క్రైం: ప్రతీ ఒక్కరు మట్టి వినాయకులనే పూజించాలని మంచిర్యాల మహిళా తరంగిణి అధ్యక్షురాలు రాజమణి అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ విద్యార్దులకు మట్టి వినాయకులను తయారు చేసే విధానంపై శిక్షణ ఇచ్చి మట్టి వినాయకులను తయారు చేయించారు. ఈ సందర్బంగా మట్టి వినాయకులను అందంగా తయారు చేసిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ వనజ, ఇందిరాదేవి, నీల, పద్మ ఉన్నారు.

బొజ్జ గణపతికి ప్రత్యేక పూజలు

మంచిర్యాల రూరల్: హాజీపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం వినాయక మండపాల్లో గణపతికి భ క్తులు ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలను, పులిహోర అందించారు. పలు మండపాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు వేంపల్లి, ముల్కల్ల, రాపల్లి దొనబండ, హాజీపూర్ గ్రామాల్లో వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.


లక్షెట్టిపేటలో గణేశుడికి 151 నైవేద్యాలు, నస్పూర్‌లో గడ్డితో అలంకరించిన వినాయకుడు

దండేపల్లిలో..

దండేపల్లి: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని మదాపూర్‌లో హనుమాన్ టెంపుల్ వద్ద ఏర్పాటు చేసిన మట్టి వినాయక మండపంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా లక్షవస్త్రధారణ, గారిక గడ్డితో గణనాధునికి భక్తులు ప్రత్యేక నైవేద్యాలతో గణనాధునికి సమర్పించి విశేషంగా పూజలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. దండేపల్లిలో యాదవ సంఘం, అర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వినాయక మండపాల వద్ద ఉత్సవ కమిటి నిర్వహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

వినాయకుడికి 151 నైవేద్యాలు..

లక్షెట్టి పేట: లక్షెట్టిపేట పట్టణంలోని గాంధినగర్ వినాయక మంటపం వద్ద మంగళవారం ఉదయం 151నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చన, అభిషేకం పూజలు నిర్వహించి హాజరైన భక్తులకు ప్రసాదాలను పంచిపెట్టారు. మండలంలోని పాతకొమ్ముగూడెం గ్రామపంచాయితీ వద్దవున్న వినాయకుని మంటపం వద్ద మధ్యాహ్నం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నస్పూర్‌లో..

నస్పూర్: నస్పూర్ మండలం నస్పూర్ కాలనీ శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో గణపతికి మంగళవారం సాయంత్రం దూర్వాలంకరణ (పచ్చిగడ్డి) చేశారు. పచ్చిగడ్డితో అందంగా అలంకరించిన గణపతిని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

క్రీడలతో మానసికోల్లాసం: సీఐ

కోటపల్లి : క్రీడలతో శారీరక వృద్ధితో పాటు మానసికోల్లాసం కలుగుతుందని చెన్నూర్ రూరల్ సీఐ రమేష్ బాబు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని కోటపల్లిలో ముందుగా టూకే రన్‌ను ప్రారంభించారు. ఇందులో వివిధ పాఠశాలలను చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు శారీరకంగా ధృడంగా ఉంటారని శిక్షణ తీసుకుంటే పోటీల్లో విజేతలవుతారన్నారు. క్రీడలకు తనవంతు ప్రోత్సాహం అందిస్తానని క్రీడాకారులకు తోడుగా ఉంటానన్నారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం గర్వంగా ఉందని ప్రతీ పాఠశాలలో క్రీడాకారులను తయారు చేయాల్సిన బాధ్యత పీఈటీలపై ఉందన్నారు. పాఠశాల స్థాయి నుంచి క్రీడల్లో విజేతలైన విద్యార్థులకు భవిష్యత్తులో అనేక అవకాశాలు ఉన్నాయని, వీటిని అందిపుచ్చుకోవాలని కోరారు. అనంతరం జాతీయ, రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్, వాలీబాల్, వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించడంతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభకనబరుస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థి కావ్యను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఏ అలీం, ఎంఈవో జగన్, ఆసుపత్రుల ఐసీయూ ఇన్‌చార్జి దాసారపు శ్రీనివాస్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్, పాఠశాలల హెచ్‌ఎంలు, వెంకటేశ్వర్, వసంత, సూర్యదాస్, పీడీ రాంమోహన్, నాయకులు గట్టాగౌడ్‌తో పాటు పాఠశాలల పీఈటీలు, క్రీడాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


క్రీడాకారిణి కావ్యను అభినంధిస్తున్న సీఐ రమేశ్‌గౌడ్

వైభవంగా కుంకుమార్చన

కోటపల్లి : కోటపల్లిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం కుంకుమార్చన పూజలను వైభవంగా నిర్వహించారు.

ఈ పాఠశాలలో వినాయ కుడిని ప్రతిష్ఠించి నవరాత్రులు సాగి స్తుండగా మండపం సమీపంలో వేద పండితుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు జరిపారు. గణపతి స్తోత్రం, సహస్ర లక్ష్మి సహస్ర నామాలు తదితర పూజలు నిర్వహించగా పాఠశాలలోని విద్యా ర్థినిలతో పాటు మహిళా ఉపాధ్యాయునిలు ఉత్సాహంగా పూజలు పాల్గొన్నారు. వం దలాది మంది విద్యార్థినులు కుంకుమ పూజలు జరపడంతో పాఠశాల ప్రాంగణం అధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సూర్యదాస్, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు ఎంఆర్ టీకాలు వేయించాలి'

మందమర్రి రూరల్ : మీజిల్స్, రుబెల్లా వ్యాధి నివారణకు ఎంఆర్ టీకాను తప్పకుండా వేయించాలని ప్రభుత్వ వైద్యులు రవి అన్నారు. మంగళవారం మండలంలోని మామిడిగట్టు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంఆర్ టీకాలను విద్యార్థులకు వైద్య సిబ్బంది చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 సంవత్సరాలోపు వయస్సు ఉన్న పిల్లలకు ఈ ఎంఆర్ టీకాను వేయించాలని సూచించారు. తట్టు, రుబెల్లా వ్యాధులు సోకకుండా పిల్లలను ఎంఆర్ టీకా కాపాడుతుందన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండటానికి వారి భవిశ్యత్ భాగా ఉండేందుకు తల్లిదండ్రులు ఎంఆర్ టీకాను వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా 85 మంది విద్యార్థులకు టీకా వేయించారు. కార్యక్రమంలో గంగాధర్, హరీష్, ఉపసర్పంచ్ రామస్వామి, ఉపాధ్యాయులు పద్మ, కల్పలత, యశోదలక్ష్మి, ఏఎన్‌ఎంలు గ్లోరి, స్వర్ణ ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


వ్యాక్సిన్ వేసిన అనంతరం పత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ రవి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలి

● తెలంగాణ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జిల్లెల మహేశ్

తాండూర్: బెల్లంపల్లి నియోజకవర్గంలోని తాండూర్, భీమిని, కన్నెపల్లి, నెన్నెల, వేమనపల్లి మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని తెలంగాణ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జిల్లెల మహేశ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆయన మంగళవారం కాసిపేట పర్యటనకు వచ్చిన విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మహేష్ మాట్లాడారు. నియోజకవర్గంలో 7 మండలాలలు ఉండగా కేవలం 2మండలాల్లోనే ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయన్నారు. దీంతో కళాశాలలు లేని 5మండలాల నుంచి పదో తరగతి పూర్తి చేసుకున్న 1000మంది విద్యార్థులు కళాశాల విద్య కోసం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న బెల్లంపల్లికి వెళ్ళాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు రూ.70 ఖర్చు చేసి దూర ప్రాంతాలకు వెళ్లలేని పేద విద్యార్థులు 10వ తరగతితోనే చదువును ఆపేయాల్సి వస్తోందన్నారు.

మండలానికో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తానని హామీనిచ్చిన ప్రభుత్వం నియోజకవర్గంలోని 5 మండలాల్లో ప్రభుత్వ కళాశాలలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. మంత్రికి వినతిపత్రం ఇచ్చిన వారిలో తెలంగాణ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, నాయకులు రమేష్, శివప్రసాద్, శ్రీనివాస్, శంకర్‌గౌడ్, రాకేష్, తదితరులు ఉన్నారు.

'సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి'

బెల్లంపల్లి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు అమలు పరుస్తున్న నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని కోరుతూ మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయ ఉద్యోగులు తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం నాయకులు ప్రవీణ్, శంకరయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వం పాతపెన్షన్ విధానం ఉద్యోగులకు అమలు పరచాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న మూకుమ్మడి సెలవు కోరుతూ ఉద్యోగులు సెలవు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు లక్ష్మణ్, లక్ష్మయ్య,శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రుణాల కోసం లబ్ధిదారుల ఎంపిక

మందమర్రి రూరల్: ఎస్సీ కార్పొరేషన్ 2016-17 సంవత్సరానికి గాను అందజేసే సబ్సిడీ రుణాల కోసం మండల పరిధిలో గ్రామ పంచాయతీలలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. అందుగులపేట, తిమ్మాపూర్, క్యాతన్ పల్లిలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దళితులైన నిరుద్యోగ, యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందజేస్తుదని పేర్కొన్నారు ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అందుగులపేట గ్రామ సర్పంచ్ లింగాల మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి సమ్మయ్య, మరియు క్యాతన్‌పల్లి, తిమ్మాపూర్ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథునికి పూజలు


వినాయకునికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మందమర్రి రూరల్ : మండలంలో వినాయక నవరాత్రుల్లో భాగంగా ప్రతిష్ఠించిన వినాయకునికి మహిళలు ఘనంగా పూజలు నిర్వహిలచారు. బ్రహ్మంగారి ఆలయం సమీపంలోని వినాయక మండపం వద్ద మంగళవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో వినాయకునికి పూజలు నిర్వహిస్తున్నారు. అదే విధంగా వెంకటాపూర్, చిర్రకుంట, సారంగపల్లి, అందుగులపేట గ్రామ పంచాయతీలలో వినాయకునికి ఘనంగా పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

'విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి'

కోటపల్లి : విద్యార్థులకు అర్థం అయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు ఎంఈవో బెజ్జంకి జగన్ సూచించారు. మంగళవారం కోటపల్లి ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సైన్స్ వల్ల కలిగే ప్రయోజనాలు, సైన్స్ పాఠ్యాంశాలను భోదించే విధానాలను గుణాత్మక విద్య తదితర అంశాల గూర్చి వివరించారు. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌తో పాటు కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద ప్రవాహానికి కూలిపోయిన వంతెన

మందమర్రి రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అందుగులపేటలోని ఎర్రవాగుపై నిర్మించిన వంతెన వరద ప్రవాహానికి కూలిపోయిది. అందుగులపేట గ్రామ ప్రజలు నిత్యం వారి పంట పొలాలకు వెళ్లాలంటే ఈ వెంతెనపై నుంచే వెళ్లాల్సి ఉంటుంది. సోలార్ పవర్‌ప్లాంట్ గ్రామ అభివృద్ధిలో భాగంగా ఎర్రవాగుపై వంతెన నిర్మించింది. ఈ వంతెను కూలిపోవడంతో పొలాలకు వెళ్లాలంటే రైతుతు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లింగాల మల్లయ్య మాట్లాడుతూ సోలార్ ప్లాంటు వారు ఈ వంతెనను నిర్మించారని వంతెను కూలిపోయిన విషయం వారికి తెలియజేశామని, వరద ప్రవాహం తగ్గిన తరువాత మరమత్తులు చేపడుతామని సోలార్ యజమానులు తెలిపినట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు...

చెన్నూర్: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండలం, పట్టణంలో వెలసిన గణనాథుల వద్ద భక్తులు మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు కుంకుమార్చన పూజలను నిర్వహించారు.

హలో...హలో..

చెన్నూర్ మండల అధికారుల ఫోన్ నంబర్లు..

● తహసీల్దార్	9491053547
● ఎంపీడీఓ	9908734963
● పోలీస్ సీఐ	9440795052
● ఎక్సైజ్ సీఐ	9440902722
● ఎంఈఓ	7382621492
● క్లస్టర్ వైద్యాధికారి	9951019641
● ఎడి(సెరికల్చర్)	9491114394
● ఎడి(అగ్రికల్చర్)	8886614534
● ఐసీడిస్ సీడీపీఓ	9491051699
● ఐకెపి ఎపిఎం	9177202573
● ఈజీఎస్ ఎపిఓ	8096604088
● వ్యవసాయశాఖ అధికారి	8886612881
● పశువైద్యాధికారి (కత్తరశాల);	8790997648

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు తదితర కార్యక్రమాల వివరాలను మాకు తెలపండి.

విలేకరుల ఫోన్ నంబర్లు

బెల్లంపల్లి	9985402901	కాసిపేట	9550355123
బెల్లంపల్లి టౌన్	9949253601	కన్నెపల్లి	9951914139
బెల్లంపల్లి రూరల్	8106018543	నెన్నెల	9908152456
తాండూర్	8125895922	వేమనపల్లి	9603485580
భీమిని	9441139527		

జాతీయ వెటరన్ క్రీడాకారుడికి సన్మానం

బెల్లంపల్లి టౌన్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి సింగరేణి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఆక్స్‌వర్డ్ గ్రామర్‌స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ వెటరన్ క్రీడాకారుడు మాదాసి గోపాల్‌ను లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా సింగరేణి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రేణికుంట్ల శ్రీనివాస్, చైర్మన్ చక్రపాణి, బెల్లంపల్లి లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ రాజలింగం మట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా బెల్లంపల్లికి చెందిన సింగరేణి కార్మికుడు గోపాల్ ఎంతో నైపుణ్యంతో జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్, సిల్వర్ మెడల్స్ సాధించి ఎంతో గొప్ప పేరు సంపాదించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సంతోష్, రాజన్న, పాఠశాల హెచ్‌ఎం ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

మీజిల్స్, రుబెల్లా టీకా వేయించాలి



మీజిల్స్, రుబెల్లా టీకాలు వేస్తున్న సిబ్బంది

తాండూర్ : 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలందరూ మిజిల్స్ రుబెల్లా టీకా వేయించుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. మంగళవారం తాండూర్ మండల కేంద్రంలోని సుభద్ర కాలనీ వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో మిజిల్స్ రుబెల్లా టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పిల్లలకు మీజిల్స్ రుబెల్లా టీకాను వేశారు. టీకా ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయమేరి, అంగన్‌వాడీ లీలారాణి, ఎఎన్‌ఎం వనిత పాల్గొన్నారు.

మహిళలకు మోటార్ డ్రైవింగ్ శిక్షణ

తాండూర్: సింగరేణి సేవా సమితి బెల్లంపల్లి వారి ఆధ్వర్యంలో మాదారం టౌన్‌షిప్‌లో మహిళలకు మోటర్ డ్రైవింగ్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు ఏరియా డిజిఎం పర్సనల్ జె.కిరణ్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సింగరేణిలో పని చేస్తున్న కార్మికుల కుటుంబ సభ్యుల్లోని మహిళల కోసం శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉండి 10వ తరగతి పాసైన మహిళలలు సెప్టెంబర్ 4వ తేదీలోపు జీఎం కార్యాలయంలో పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో అందించాలని ఆయన సూచించారు.

నేడు బెల్లంపల్లిలో ఓడీఎఫ్ పై సమావేశం

భీమిని : బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలీ భవనంలో బుధవారం ఓడీఎఫ్ పై ప్రత్యేక సమావేశం నిర్వహించనునట్లు ఎంపీడీవో శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కలెక్టర్, ఎమ్మెల్యే హాజరుకానున్నారు. దీనికి భీమిని, కన్నెపల్లి మండలాల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీలు సభ్యులు, ఐకేపీ, ఈజీఎస్ సిబ్బంది, గ్రామ, మండల స్థాయి అధికారులందరూ హాజరుకావాలని కోరారు.

బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలీ భవనంలో ఉదయం 10.30 లకు ఓడీఎఫ్ అవగాహన సదస్సు ప్రారం భమవుతందన్నారు.

గణనాథులకు భక్తిశ్రద్ధలతో పూజలు

చెన్నూర్: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండలం, పట్టణంలో వెలసిన గణనాథుల వద్ద భక్తులు మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణం, మండలంలోని పలు గణేష్ మండపాల నిర్వహకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

అలాగే భక్తులు ప్రత్యేక పూజలతోపాటు కుంకుమార్చనలను నిర్వహించారు.

మున్సిపల్ అభివృద్ధికి కౌన్సిలర్లు సహకరించాలి

● చైర్‌పర్సన్ సునితారాణి





మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సునీతారాణి, సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

బెల్లంపల్లి టౌన్: బెల్లంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి మున్సిపల్ కౌన్సిలర్లు సహకరించాలని చైర్‌పర్సన్ పసుల సునీతారాణి కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జరిగిన తీర్మాణాలను విలేకరులకు వెల్లడించారు. మున్సిపల్ సమావేశంలో సభ్యులు 12 అంశాలకు ఆమోదం తెలిపారని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధి విషయమై సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు సమస్యలను తెలిపినట్లు పేర్కొన్నారు. అంతే కాకుండా పోశమ్మ చెరువు వద్ద నిర్వహించే గణేష్ నిమజ్జనోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నిమజ్జనం చేసే రోజు చెరువు వద్ద రెండు క్రేన్‌లు, రెస్క్యూటీం, పోలీస్ బందోబస్తు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్ కిష్టయ్యను పదో వార్డు కౌన్సిలర్ లక్ష్మి భర్త మల్లయ్య ఇష్టానుసారంగా ఫోన్‌లో దూషించారని తెలిపారు. అతనిని సరెండ్ చేయాలని కోరడంలో అర్థం లేదన్నారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న అధికారులు తప్పు చేస్తే కలెక్టర్, ఆర్‌జేడీ దృష్టికి తీసుకెళ్లాలి తప్ప సస్పెండ్ చేయాలనడం సరైందికాదన్నారు. కౌన్సిలర్ లక్ష్మిని శానిటరి ఇన్‌స్పెక్టర్ దూషించినట్లు ఏవైనా ఆధారాలు ఉంటే శానిటరి ఇన్‌స్పెక్టర్‌పై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, కౌన్సిలర్లు తాండ్ర ప్రవంతి, ఎలిగేటి శ్రీనివాస్, రామన్న, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

● రెండో వార్డు అభివృద్ధికి కృషి..

బెల్లంపల్లి మున్సిపాలిటీలోని రెండో వార్డును అన్ని విధాల అభివృద్ధి పరిచేందుకు కృషిచేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ సునీతారాణి తెలిపారు. మంగళవారం రెండో వార్డు మున్సిపల్ ప్రణాళికేతర నిధులు రూ.2 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజల సమస్యల పరిష్కారం కొరకు అన్ని విధాల కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొన్ని వీదుల్లో రోడ్లు నిర్మించాలని, వార్డు కౌన్సిలర్ కోరారని, ఇందుకు తగు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెండో వార్డు కౌన్సిలర్ ఆరెపల్లి సుధారాణి, మున్సిపల్ కౌన్సిలర్లు ఎలిగేటి శ్రీనివాస్, యూసుఫ్, వాసు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఖ్యాతి గడించాలి : ఎంఈవో



విద్యార్థులకు క్రీడాపరికరాలు అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కన్నెపల్లి : జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా కారులుగా రాణించి ఉత్తమ క్రీడాకారులుగా ఖ్యాతి గడించాలని మండల విద్యాధికారి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం ధ్యాన్‌చంద్ పుట్టిన రోజైన జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను ఆదర్శంగా తీసుకోవాలని, విద్యార్థులకు చదువుతో పాటూ క్రీడలు అవసరమన్నారు. క్రీడల్లో రాణించిన వారు చదువులో చురుకుగా ఉంటారని, క్రీడల వల్ల ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. దీంతో పాటూ క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలను అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రాజలింగం, రీజినల్ చైర్‌పర్సన్ కే. సత్య నారాయణ, ట్రెసరర్ ప్రభాకర్, కే. మల్లికార్జున్, కేశవరావు, తహసీల్దార్ విజయానంద్, పీఈటీ చాంద్‌పాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణేశ్ మండపాల్లో అన్నదానాలు

తాండూర్ : మండలంలోని ఐబిలోని శ్రీ గణేష్ మండలి వద్ద, మాదారంలోని వృక్ష వినాయక ఆలయం వద్ద, కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి ఆ లయంలో వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మ హిళలు 108 రకాల ప్రసాదాలను తయారు చేసి స్వామికి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు.

గణేష్ మండపాల వద్దకు వచ్చిన వారికి అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి గీతారాణి మొక్కలు పంపిణీ చేశారు.

విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌ల అందజేత



విద్యార్థులకు బస్‌పాస్‌లు అందిస్తున్న ఆర్టీసీ అధికారులు, ఉపాధ్యాయులు

భీమిని : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆసిఫాబాద్ డిపో అధికారులు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లను అందించారు. ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 వ తరగతి వరకు చదువుతున్న తెనుగుపల్లి, రాంపూర్, మల్లీడీ, వడాల గ్రామాలకు చెందిన 100 మంది విద్యార్థులకు అందజేశారు. గతంలో దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చేరుకోవాలంటే నానా ఇబ్బందులను ఎదుర్కొనేవారు, దీంతో పాఠశాలలో డ్రాపౌట్స్ పెరగడంతో పాఠశాల ఉపాధ్యాయులు ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం ఇవ్వడంతో స్పందించిన అధికారులు పాఠశాలకు వచ్చి నేరుగా పాస్‌లను అందించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ అసిస్టెంట్ డిపో మేనేజర్ యాకూబ్, ఏడీసీ వి. బాబూరావు, బస్ పాసుల ఇన్‌చార్జి బుచ్చన్న, రమేష్, రామన్న, తిరుపతి పాల్గొన్నారు.

హలో...హలో..

నెన్నెల మండల అధికారుల ఫోన్ నంబర్లు..

● తహసీల్దార్	9491053557
● ఎంపీడీఓ	9492541660
● మండల విద్యాధికారి	9492968793
● ఎస్సై	9440795032
● మండల వ్యవసాయ అధికారి	8886612886
● ఫారెస్ట్‌రేంజ్ అధికారి	9440810398
● మెడికల్ ఆఫీసర్	9908232535
● ఐకేపీ ఏపీఎం	9177202636
● ఈజీఎస్ ఏపీవో	8096604092
● పంచాయత్‌రాజ్‌ఏఈ	9440731694
● ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	967652779
● పశువైద్యాధికారి	9703531852
● పశువైద్యాధికారి	9703531852
● విద్యుత్ ఏఈ	8333923868

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 5

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది. వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆంతరంగిక చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. పూజలు, వేడుకల్లో పాల్గొంటారు. విరాళాలు, దానధర్మాలకు ఖర్చు చేస్తారు.

మిథునరాశి: (మే21-జూన్21): ప్రియతముల కలయికతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. సమావేశాల్లో మార్పులకు ప్రయత్నిస్తారు. వేడుకలు, శుభకార్యాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి అనుకూలం.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): వృత్తి, వ్యాపారాలకు అవసరమైన పత్రాలు, సరకుల రవాణాకు అనుకూలం. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి. రిజిస్ట్రేషన్లకు శుభతరుణం. సన్నిహితు ఆరోగ్య విషయాలపై దృష్టి సారిస్తారు.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): పొదుపు పథకాలు లాభిస్తాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. షాపింగ్, క్రయవిక్రయాలకు అనుకూలం. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): బదిలీలు, మార్పులకు అనుకూలం. దూరంలో ఉన్న బంధుమిత్రులను కలుసుకుంటారు. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. వాయిదాపడుతున్న పనులు పూర్తి చేస్తారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆర్థికపరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆర్థిక సంస్థలు, బ్యాంకులతో పనులు పూర్తవుతాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ప్రేమానుబంధాలు బలపడతాయి.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): సంకల్పం నెరవేరుతుంది. ప్రభుత్వ సంస్థలు, రాజకీయ రంగాల వారు గౌరవ, మన్ననలు అందుకుంటారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వృత్తి, వ్యాపారాల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): దూరంలో ఉన్న ప్రియతములను కలుసుకుంటారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు, ఉత్సవాలకు నిధులు సమకూరతాయి. ముఖ్య సమాచారం అందుకుంటారు. సినీ, రాజకీయ రంగాల వారికి ప్రోత్సాహకరం.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బృందకార్యక్రమాలు, వేడుకలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. షాపింగ్ ఆనందం కలిగిస్తుంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో సమావేశాలు ఫలిస్తాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఉన్నత పదవులు అందుకుంటారు. భాగస్వామి సహకారంతో వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. జన సంబంధాలు మెరుగుపడతాయి. వేడుకలు, శుభకార్యాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

క్రీడాకారులకు అన్ని వసతులు కల్పిస్తాం

● మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్

మంచిర్యాల క్రైం: జిల్లాలోని క్రీడాకారులు మరింతగా రాణించేందుకు అన్ని వసతులు కల్పిస్తామని మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు మంచి ప్రతిభను కనబరుస్తున్నారన్నారు. ప్రతిభ ఉన్నవారిని ప్రోత్సహిస్తామన్నారు. అనంతరం క్రీడాకారులతో కలిసి ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఆయనతో పాటు డీఈవో రవికాంత్‌రావు, డీవైఎస్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా క్రీడా సంఘాల బాధ్యులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఫుట్‌బాల్, కబడ్డీ, బాక్సింగ్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ హాజరై బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు బెల్లం శ్రీనివాస్, రోజి వరకుమారి, గోపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బాక్సింగ్‌లో తలపడుతున్న క్రీడాకారులు, గెలుపొందిన క్రీడాకారులు

సీపీఎస్‌కు వ్యతిరేకంగా చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలి

● టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమిరెడ్డి

మంచిర్యాల క్రైం: కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేయాలని, సెప్టెంబర్ 1 నుంచి జిల్లా కేంద్రంలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమిరెడ్డి కోరారు. మంగళవారం బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోసం కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో ఉపాధ్యాయులందరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వాలు తీసుకువచ్చిన సీపీఎస్ విధానం దుర్మార్గమైందన్నారు. 1 నుంచి 30 వరకు ర్యాలీలు, ధర్నాలను, నిరసన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. మూడు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని సర్వీస్ రూల్స్ సమస్యను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, సంయుక్త కార్యదర్శి లచ్చిరాం, కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రేంరావు, బన్న రవిందర్, వెన్నం లక్ష్మినారాయణ, సత్తయ్య, బానయ్య, దేవదాస్, బాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'సైన్స్ పాఠాలను ప్రయోగ పద్ధతిలో బోధించాలి'

దండేపల్లి: విద్యార్థులకు సైన్స్ పాఠాలను ప్రయోగాల పద్ధతిలో బోధిస్తే సులువుగా అర్థం అవుతుందని దండేపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం పాండురంగప్ప సూచించారు. దండేపల్లి ఉన్నత పాఠశాలో మంగళవారం సైన్స్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ చదువులో వెనుకబడి ఉన్నా విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి ప్రత్యేక తరగతుల ద్వారా చక్కటి విద్యా బోధన చేయాలన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కోట్నాక భీంరావు కృషి

● ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఆసిఫాబాద్: మాజీ మంత్రి దివంగత కోట్నాక భీంరావు గిరిజనుల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి కొనియాడారు. మంగళవారం కోట్నాక భీంరావు 15వ వర్ధంతి సందర్భంగా కోవలక్ష్మి దంపతులు ఎమ్మెల్యే ఇంటి నుంచి ఆదివాసీ సంప్రదాయ బద్ధంగా ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసిఫాబాద్ నియోజక వర్గం నుంచి మొట్టమొదటి గిరిజన ఎమ్మెల్యేగా గెలిచిన తన తండ్రి భీంరావు గిరిజనులు అభివృద్ధి చెందేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. వీడీడీఏ, రాయిసెంటర్‌లను ఏర్పాటు లాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ఆదివాసీలను సంఘటితం చేశారన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ గంధం శ్రీనివాస్, ఎంపీపీలు తారాబాయి, లక్ష్మి, గణేష్, జడ్పీటీసీ కమల, టీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్, పట్టణ అధ్యక్షుడు అహ్మద్‌బీన్ అబ్దుల్లా, ఎంపీటీసీలు హరిప్రియ, రవీందర్, గోపాల్, నాయకులు సింగాడే అశోక్, రవి, సుధాకర్, అర్జు మస్టర్, రమేష్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

'తాగునీటి సమస్యను పరిష్కరించడంలో విఫలం'


మంచిర్యాల మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

మంచిర్యాల క్రైం: మంచిర్యాల పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరిండంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజా సంఘం నాయకులు, ఎన్‌టిఆర్ నగర్ కాలనీ వాసులు ఆరోపించారు. మంగళవారం తాగు నీటి సమస్యను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిషన్ భగీరథ తవ్వకాల్లో భాగంగా ముల్కల్ల వద్ద పగిలిన పైపుల మరమ్మతులు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. 25 రోజుల నుంచి ఎన్‌టిఆర్ నగర్, రాంనగర్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా నెలకొందన్నారు. ఎన్‌టిఆర్ నగర్‌లో పూర్తిగా మున్సిపల్ నల్లా వాటర్‌పైనే ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. బోర్లు వేసుకునే స్థోమత లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే అధికారులు సమస్యను పరిష్కరించి తాగు నీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ నగర్ కాలనీ వాసులు అమిరిశెట్టి రాజు, ఐనాల సతీష్, పెద్దపెల్లి సూరయ్య, సంపత్, సాయి, బీసీ సంఘాల నాయకులు గుమ్ముల శ్రీనివాస్, ఇప్పకాయల శ్రీనివాస్, మెట్‌పల్లి రంజిత్‌రావు, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలి...

చెన్నూర్: లబ్ధిదారులు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని డీఆర్‌డీఓ వెంకటి కోరారు. మంగళవారం ఆయన మండలంలోని కాచన్‌పల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద నిర్మిస్తున్న వ్యక్తి గత మరుగుదొడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు సకాలంలో మరుగుదొడ్లను నిర్మించుకోవాలని కోరారు. గ్రామంలో వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి స్వచ్ఛ భారత్‌కు కృషి చేయాలని కోరారు. నిర్మాణదారులకు బిల్లులు వెంటనే చెల్లించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమములో ఎంపీడీవో మల్లేశ్, ఈజీఎస్ ఎపీఓ గంగాభవాని, సర్పంచ్ నరిగె లింగయ్య, టీఎలు మహేశ్వర్ రెడ్డి, రవిందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గుర్తింపు ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి'

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం సత్యనారాయణ అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలో అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలోనే అతి పెద్ద ఏరియా శ్రీరాంపూర్‌లో రాబోయే ఎన్నికల ప్రభావం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. గనుల వారీగా ఓటర్ లిస్టు తయారు చేసుకుని గనుల ఆవరణలో ప్రదర్శించాలన్నారు. ఈ సమావేశంలో డీజీఎం పర్సనల్ చిత్తరంజన్‌కుమార్, ఏజీఎం(ఐఈడీ)ఫణి, ఏజీఎం(ఈఅండ్ఎం)రాంబాబు పాల్గొన్నారు.

అవకాశవాద కార్మిక సంఘాలకు బుద్ధి చెప్పాలి

● సీఐటీయూ అధ్యక్షుడు రాజారెడ్డి



జీడీకే 11వ గని గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని: సింగరేణిలో అవకాశవాద కార్మిక సంఘాలకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు టీ.రాజారెడ్డి కార్మికులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆర్‌జీ-1జీడీకే 11వ గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ కార్మికుల హక్కుల రక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఆరో వేతన ఒప్పందంలో మూడు ఇంక్రిమెంట్లు సాధించామన్నారు. కొన్ని కార్మిక సంఘాలు వేతన ఒప్పందం విషయంలో కార్మికులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ఈ ఎన్కిల్లో సీఐటీయూకు ఓటు వేసి గెలిపించాలని రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు మెండె శ్రీనివాస్, మల్లయ్య, రామన్న, ఆనందం, రాజేష్, కొమురయ్య, మొగిలి, చంద్రయ్య పాల్గొన్నారు.

జాతీయ సంఘాల అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలి

● టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి

శ్రీరాంపూర్: జాతీయ సంఘాలు టీబీజీకేఎస్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, దీన్ని కార్మికులు తిప్పికొట్టాలని ఆ సంఘం ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపూర్‌లోని ఎస్సార్పీ-3గని గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ గెలిస్తే వారసత్వ ఉద్యోగాలు శాశ్వతంగా రావన్నారు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు పోగొట్టింది, కాంట్రాక్టీకరణకు బీజం వేసింది ఏఐటీయూసీనే అని ఆరోపించారు. 35 వేల మంది కార్మికులను గోల్డెన్ షేక్‌హ్యాండ్ పేరిట తొలగించారన్నారు. జీబులు, లారీలు, బస్సులు, సివిల్, సివిక్, స్టోర్, వర్క్‌షాప్ పనులు, పార్కులు, ఓబీ పనులు, అండర్‌గ్రౌండ్‌లో రూప్‌బోల్టింగ్, టన్నులు, మిషనరీలు తదితర పనులను అవుట్‌సోర్సింగ్ పేరున ప్రైవేట్ పరం చేసేందుకు ఏఐటీయూసీ కారణమని పేర్కొన్నారు. పదో వేజ్‌బోర్డులో 50 శాతం వేతన పెరుగుదల సాధిస్తామని 20 శాతానికి వచ్చి అలవెన్సులు విస్మరించారన్నారు.

పెన్షన్ మూలధనం పేరున కార్మికుల జీతాల్లో వేల రూపాయల కోత పెడుతున్నారన్నారు. కోలిండియా యాజమాన్యాలు, కేంద్ర ప్రభుత్వానికి కొమ్ము కాస్తూ ఏడు దినాల పని విధానానికి లింకు పెట్టి 4లక్షల బొగ్గు గని కార్మికుల జీవితాలతో చెలగాట మాడుతున్నారని విమర్శించారు. త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వారా వారసత్వ ఉద్యోగాలు, బదిలీ కార్మికుల పర్మినెంట్, క్యాడర్‌స్కీం, లాభాల్లో వాటా సంక్షేమ పథకాలు తదితర వాటిని సాధించి పెడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటి నాయకులు బంటు సారయ్య, వీరభద్రయ్య, మహిపాల్‌రెడ్డి, కాశీరావు, చంద్రయ్య, లింగారావు, గోపాల్, ఫిట్ కార్యదర్శి గోప్య, రమేష్ పాల్గొన్నారు.

మెరుగైన వేతన ఒప్పందానికి కృషి

● హెచ్‌ఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు సత్తయ్య

గోదావరిఖని: పదో వేజ్‌బోర్డు సమావేశంలో మెరుగైన వేతన ఒప్పందం సాధించేందుకు హెచ్‌ఎంఎస్ కృషి చేస్తోందని ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆర్‌జీ-1 జీడీకే 2వ గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ ఈ నెల 31న మెరుగైన వేతన ఒప్పందం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అలాగే కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో చిత్తశుద్ధితో పని చేశామని సత్తయ్య తెలిపారు. భూగర్భ గనుల్లో తాగునీటిని అందించామని, వెంటిలేషన్, నూతన ఎస్‌డీఎల్, ఎల్‌హెచ్‌డీ యంత్రాలు, మ్యాన్ రైడింగ్ విధానాన్ని మెరుగు పరిచామని పేర్కొన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్య అందేలా కృషి చేశామని ఆయన గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో హెచ్‌ఎంఎస్‌ను ఆదరించి ఓటు వేయాలని విజప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు సత్యనారాయణ, రామస్వామి, గంగారాం, నర్సయ్య, గౌరయ్య, కోటయ్య, శ్రీనివాస్, వెంకటస్వామి, జాబుపోశం, రాజయ్య, బాలయ్య పాల్గొన్నారు.

ఒంటరి పోరుకు టీఎన్‌టీయూసీ నిర్ణయం

● రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అన్ని ఏరియాల్లో ఎన్నికల ప్రచార కమిటీలు ● 2019 సార్వత్రిక ఎన్నికలే టార్గెట్

(ఆంధ్రజ్యోతి- మంచిర్యాల)

అక్టోబర్ 5న జరగనున్న సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టీడీపీ అనుబంధ యూనియన్ టీఎన్‌టీయూసీ ఒంటరిగానే పోటీ చేయాలని నిర్ణయించింది. టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అన్ని ఏరియాల్లో ఎన్నికల ప్రచార కమిటీలు వేయనున్నారు. గుర్తింపు ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు పెట్టుకోవద్దని నిర్ణయించుకున్నట్లు మంగళవారం టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ శరత్‌బాబు ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఈనెల 27న హైదరాబాద్‌లో టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డిల అధ్యక్షతన జరిగిన యూనియన్ నాయకుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. సింగరేణి సంస్థ బీఐఎఫ్ఆర్‌లోకి వెళ్లి నష్టాల సంస్థగా మారిన సందర్భంలో చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి 660 కోట్ల మానిటోరియం ఇప్పించిన విషయాన్ని కార్మికుల్లో ప్రచారం చేయాలని నిర్ణయించారు. సంస్థ లాభాల బాటలో పయనించింది, కార్మికులకు వాటా పంచింది కూడా టీడీపీ హయాంలోనే కార్మికులకు వివరించాలన్నారు. గని ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా పెంచి ఇచ్చిన ఘనత కూడా టీడీపీ ప్రభుత్వానిదే అని కార్మికులకు వివరించాలని టీడీపీ అగ్రనేతలు నాయకులకు సూచించారు. త్వరలోనే సింగరేణి విస్తరించి ఉన్న ఆరు జిల్లాల్లో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కమిటీలు వేయాలని సమావేశంలో నిర్ణయించారు.

రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పోరుకు వ్యూహం

ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఆరు జిల్లాలలో జరగనున్న సింగరేణి యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో టీడీపీ అనుబంధ టీఎన్‌టీయూసీ పోటీ చేయనున్నది. 11 ఏరియాల్లో రేవంత్‌రెడ్డి పర్యటిస్తారు. టీడీపీకి చెందిన తెలంగాణ నాయకత్వమంతా సింగరేణిలో పర్యటించనుంది. 2019 సార్వత్రిక ఎన్నికలే టార్గెట్‌గా ఈ ఎన్నికలలో టీడీపీ తమ యూనియన్‌ను రంగంలో దించుతోంది.

'వారసత్వ ఉద్యోగాలు టీబీజీకేఎస్‌తోనే సాధ్యం'



కార్మికులతో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకులు

మందమర్రి: సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు టీబీజీకేఎస్‌తోనే సాధ్యమని ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ పేర్కొన్నారు. మంగళవారం మందమర్రి ఏరియాలోని కేకే-1 గనిపై కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికులకు అనేక హక్కులను సాధించి పెట్టిన ఘనత తమ యూనియన్‌దే అన్నారు. గతంలో వారసత్వపు ఉద్యోగ హక్కును శాశ్వత సమాధి చేసిన జాతీయ సంఘాలకు తమను విమర్శించే అర్హత లేదన్నారు. కార్మికులకు తమ యూనియన్ అధికారంలోకి వచ్చిన తరువాతనే అనేక ప్రయోజనాలు చేకూర్చామన్నారు. స్వరాష్ట్రం కోసం 34 రోజులు సమ్మె చేసిన కార్మికులకు సమ్మెకాలం వేతనాలు ఇచ్చిన ప్రభుత్వం తమదేనన్నారు. అంతేకాకుండా తెలం గాణ ఇంక్రిమెంట్ అనేక పదోన్నతులు, తమ హయాంలోనే సాధించామని తెలిపారు. తమ యూనియన్‌పై లేనిపోని విమర్శలు చేస్తున్న జాతీయ సంఘాలకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఓటమి భయంతోనే జాతీయ సంఘాలు కూటమిగా పోటీ చేయడానికి సిద్ధమవుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏరియా నాయకులు జే రవీందర్, చర్చల కమిటీ ప్రతినిధి రాజశేఖర్, కే లక్ష్మణ్, ఫిట్ కార్యదర్శి కొండల్‌రావు పాల్గొన్నారు.

ఇరుగు.. పొరుగు..

భూనిర్వాసిత కమిటీ డివిజన్ అధ్యక్షుడిగా రవీందర్

కాకతీయఖని: సింగరేణి భూనిర్వాసిత ప్రభావిత గ్రామాల సంక్షేమ సంఘం భూపాలపల్లి డివిజన్ అధ్యక్షుడిగా గడ్డిగానిపల్లికి చెందిన జాడి రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు జనగాం శంకర్ తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ సింగరేణి భూనిర్వాసితుల ప్రభావిత గ్రామాల ప్రజల సంక్షేమానికి రవీందర్ చేసిన కృషిని గుర్తించి ఆయనను ఎన్నుకున్నట్లు శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో తనకు భాద్యతలు అప్పగించినందుకు రాష్ట్ర కమిటీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'పర్యావరణ పరిరక్షణకు చర్యలు'

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రజలు మొక్కలు రక్షించి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపూర్‌లోని తాళ్ళపల్లిలో పునరావాస కాలనీలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రజలకు ఉచితంగా పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓసీపీ అధికారి కవీంద్ర, ఎస్టేట్ అధికారి సుబ్రమణ్యం, వెంకటేశ్వర్‌రెడి పాల్గొన్నారు.

'మోసపూరిత వాగ్దానాలను కార్మికులు నమ్మొద్దు'

శ్రీరాంపూర్: టీబీజీకేఎస్ నాయకుల మోసపూర్తి వాగ్దానాలను కార్మికులు నమ్మొద్దని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపూర్‌లోని ఆర్కె-7గని గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. టీబీజీకేఎస్ గత మెనిఫెస్టోలో పెట్టిన ఒక్క డిమాండ్‌ను కూడా సాధించలేకపోయిందన్నారు. తెలంగాణ వాదంతో గెలుపొందిన టీబీజీకేఎస్ కార్మికులకు ఒరగబెట్టింది ఏమిలేదన్నారు.

వారసత్వ ఉద్యోగాలు శాశ్వతంగా రాకుండా చేసిన ఘనత టీబీజీకేఎస్‌కే దక్కుతుందన్నారు. వారసత్వ ఉద్యోగాల సాధించేందుకు జాతీయ సంఘాల ఆధ్వర్యంలో సమ్మెకు పిలుపునిస్తే యాజమాన్యంతో కుమ్మక్కై విచ్చిన్నానికి పాల్పడి కార్మిక ద్రోహులుగా మిగిలారన్నారు. అనంతరం ఏఐటీయూసీలో చేరిన వారికి కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కొట్టె కిషన్‌రావు, ఫిట్ కార్యదర్శి నెరువెట్ల మల్లేష్, మైనింగ్ నాయకులు పారుపెల్లి రాజేందర్, లక్ష్మన్‌రావు, రేగుల శంకర్, బొల్లవేని రాములు, సారయ్య, లింగయ్య, పెద్దన్న, వీరస్వామి, బేర రవీందర్, ప్రతాప్, మేకల దాసు, కలవేన శ్యాం పాల్గొన్నారు.

'ఏఐటీయూసీ హయాంలోనే ప్రైవేటీకరణకు పునాది'



శ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు రమేశ్

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థలో ఏఐటీయూసీ హయాంలోనే ప్రైవేటీకరణకు పునాది పడిందని హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు పేరం రమేష్ పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపూర్‌లోని ఓసీపీ గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో ఏఐటీయూసీ మూడు దఫాలుగా గెలిచి ఉన్న హక్కులను కూడా పోగొట్టిందన్నారు. వర్క్‌షాపులు, అంబులెన్స్‌లు ప్రైవేట్ పరం చేసి డిస్పెన్సరీలను ఎత్తివేసేందుకు కారకులయ్యారని ఆరోపించారు. ట్రేడ్స్‌మెన్లకు హెల్పర్లు లేకుండా చేసిన ఘనత ఏఐటీయూసీకే దక్కిందని ఎద్దేవా చేశారు. గనుల్లో ప్రైవేట్ కార్మికులు దిగి సపోర్టు పనులు చేయడం, ప్రైవేట్ సర్ఫేస్ మైనర్ యంత్రాలు తేవడం, గోల్డెన్‌హ్యాండ్ షేక్‌తో కార్మికులను తగ్గించడం, వారసత్వ ఉద్యోగాలు పోగొట్టడం లాంటివి ఏఐటీయూసీ హయాంలోనే జరిగాయన్నారు. టీబీజీకేఎస్ తెలంగాణవాదంతో గెలిచి పదవుల కొట్లాట, పైసల పంచాయితీలతోనే కాలం గడిచిపోయిందన్నారు. ముఖ్యమంత్రి షరతులు లేని ఉద్యోగాలు ఇవ్వాలని చెప్పినా టీబీజీకేఎస్ నాయకులు రాజ్యాంగ విరుద్ధ సర్క్యులర్ తెచ్చి ఉద్యోగాలు రాకుండా చేశారని విమర్శించారు. మెడికల్ అన్‌ఫిట్ల కోసం కార్మికుల వద్ద లక్షలాది రూపాయలు వసూలు చేశారని, వారసత్వ ఉద్యోగాలు వస్తే తీసుకున్న డబ్బులు ఎక్కడ తిరిగి ఇవ్వాల్సి వస్తుందోనని వారి కార్యకర్తతోనే కోర్టులో కేసు వేయించారని ఆరోపించారు. కార్మికుల పక్షాన నిలబడి పోరాడే సంఘం హెచ్‌ఎంఎస్ ఒక్కటేనన్నారు. ఈ కార్యక్రమంలో ముస్కె మల్లేష్, సుధాకర్, రాజేంద్రప్రసాద్, గండి సతీష్, సత్తయ్య, ఎన్‌వీరావు, హనీఫ్, సత్యనారాయణ, మీస కొమురయ్య, ఎర్ర లచ్చన్న, అశోక్‌కుమార్, చాంద్ పాషా, బాబురావులు పాల్గొన్నారు.

చెరువుకు కరువు!

- 766 చెరువుల్లో నేటికీ 25శాతమే నీళ్లు
- సగానికి పైగా సాగులోకి రాని ఆయకట్టు
- ఆశలు వదులుకుంటున్న అన్నదాతలు

(ఆంధ్రజ్యోతి - మంచిర్యాల)

తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని చెరువులకు నీటి కరువొచ్చింది. జిల్లావ్యాప్తంగా 952 చెరువులుండగా, కేవలం ఆరు చెరువులు మాత్రమే పూర్తిస్థాయిలో నిండాయి. మరో ఐదుచెరువుల్లోకి 75 నుంచి 100శాతంలోపు నీరుచేరగా, 766 చెరువులు 25శాతం నీటికే పరిమితమయ్యాయి. 128 చెరువులు 25 నుంచి 50శాతం, 47 చెరువులు 50 నుంచి 75శాతం నిండాయి. దీంతో ఆయా చెరువుల కింద ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది.

● తీవ్ర వర్షాభావ పరిస్థితులు..

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ నుంచి ఆగస్టు 29వరకు 817.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, 536.7 34శాతం మాత్రమే నమోదైంది. మొత్తంమీద 34శాతం లోటు కనిపిస్తున్నది. ఫలితంగా ఈ ఏడాది సాగు విస్తీర్ణం పడిపోయింది. ఈ ఖరీఫ్‌లో 2.26 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేయగా, ఇప్పటివరకు కేవలం 1,59,000 ఎకరాల్లోనే సాగయ్యాయి. ఇందులో 84 వేల ఎకరాల్లో పత్తి, 75 వేల ఎకరాల్లో వరి సాగైనట్లు అధికారులుచెబుతున్నారు. మరో 25 వేల ఎకరాల్లో నాట్లు పడాల్సి ఉన్నా పడలేదు.

● చెరువుల కింద 30శాతమే సాగు..

జిల్లాలో 952 చెరువుల కింద 84వేల ఎకరాల ఆయకట్టు ఉంది. 766(80శాతం) చెరువుల్లోకి పావు వంతు కూడా నీరు చేరకపోవడంతో వాటి కింద సాగు ప్రశ్నార్థకంగా మారింది. చాలాచోట్ల రైతులు నాట్లు వేసే పరిస్థితి లేకుండా పోయింది. అధికారుల అంచనాల ప్రకారమే చెరువుల కింద కేవలం 30శాతం భూములు మాత్రమే సాగులోకి వచ్చాయి. అదును దాటిపోవడంతో నార్లు ముదిరి నాటుకు పనికిరాకుండా పోయాయి. ఫలితంగా రైతులు ఆయా పొలాలపై ఆశలు వదిలేసుకున్నారు.



దండేపల్లి మండలం ముత్యంపేటలో 75 శాతం నిండిన చెరువు

● నాలుగురోజులుగా జల్లులు..

నాలుగురోజులుగా జిల్లాలో జల్లులు కురుస్తున్నా భారీ వర్షాలు లేకపోవడం అన్నదాతలను కలవరపెడుతున్నది. మంగళవారం జిల్లాలో 26.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జన్నారంలో 14.2, దండేపల్లిలో 16.6, లక్సెట్టిపేటలో 8.6, మంచిర్యాలలో 7.0, మందమర్రిలో 15.4, జైపూర్‌లో 25.2, చెన్నూర్‌లో 22.4, కోటపల్లిలో 90.2, బెల్లంపల్లిలో 49.2, తాండూర్‌లో 27.4, భీమినిలో 18.6, కాసిపేటలో 9.2, నెన్నెలలో 93.4, వేమనపల్లిలో 36.4 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారయంత్రాంగం ప్రకటించింది.

● ఎల్లంపల్లిలో పెరుగుతున్న నీటిమట్టం..

ఎగువన కురుస్తున్నవర్షాలతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం పెరుగుతున్నది. ప్రస్తుతం 12,477 క్యూసెక్కుల వరద నీరువచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.175టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.86 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. 310 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగుతున్నది.

జిల్లాకు 2,54,916 బతుకమ్మ చీరలు

(ఆంధ్రజ్యోతి - మంచిర్యాల)

జిల్లాలోని పేద, మధ్యతరగతి మహిళలకు 2,54,916 బతుకమ్మ చీరలు ఉచితంగా అందజేయనున్నారు. ఈమేరకు రేషన్ కార్డుల ఆధారంగా లబ్ధిదారులను ఎంపికచేస్తారు. సెప్టెంబర్ మొదటి వారంలో సిరిసిల్ల, సూరత్ నుంచి చీరలు జిల్లాకుచేరుకోనుండగా, రెండోవారంలో పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

● 18 ఏళ్లు నిండినవారు అర్హులు..

ఈ నెల 1వ తేదీవరకు 18 ఏళ్లు నిండిన మహిళలు చీరలు స్వీకరించేందుకు అర్హులు. వయస్సు నిర్ధారణ కోసం ఆధార్, ఓటర్‌కార్డు, పదోతరగతి మెమో.. ఇలా ఏ ఆధారం చూపినా సరిపోతుంది. ఆహారభద్రత కార్డు, అంత్యోదయ యోజనా, అన్నపూర్ణ కార్డులపై కూడా పుట్టిన తేదీ ఉంటుంది. చీరతో పాటు జాకెట్ పీస్‌లను కూడా పంపిణీ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సమాఖ్య సంఘం అధ్యక్షురాలు, సంబంధిత రేషన్ డీలర్‌తో గ్రామాలవారీగా కమిటీలు వేసి, పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు. పట్టణాల్లో మున్సిపాలిటీ బిల్ కలెక్టర్, మెప్మా అధ్యక్షురాలు, సంబంధిత డీలర్లతో కమిటీలు ఏర్పాటుచేస్తారు. రేషన్‌కార్డుల ఆధారంగా లబ్ధిదారులను ఎంపికచేసి, రేషన్ డీలర్ల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలుస్తున్నది.

● సిరిసిల్ల, సూరత్ నుంచి..

జిల్లాకు అతిత్వరలో సిరిసిల్ల, సూరత్ నుంచి బతుకమ్మ చీరలు రానున్నాయి. చెన్నూర్ చేనేత సంఘానికి కూడా ఆర్డర్ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించినా, అధికారులు పట్టించుకోనట్లు తెలుస్తున్నది. ఇప్పటికైతే ఈ సంఘానికి ఎలాంటి ఆదేశాలు అందలేదు. దీంతో వారికి ఎదురుచూపులు తప్పడం లేదు.



వార్డెన్ నిర్లక్ష్య కారణంగానే విద్యార్థిని మృతి

అఖిల కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి ● విద్యార్థి నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

శ్రీరాంపూర్: జైపూర్ మండలంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో వార్డెన్ నిర్లక్ష్యం వల్లే అల్లూరి అఖిల అనే దళిత విద్యార్థి మృతి చెందిందని టీబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జాగిరి రాజేష్, జేఏసీ నాయకుడు చంద్రగిరి నరేష్, బీసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి మామిడాల ప్రవీణ్ ఆరోపించారు. మంగళవారం శ్రీరాంపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. అఖిలకు జ్వరం వస్తే వార్డెన్ పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశాడని, ప్రాణాల మీదకు రావడంతో తప్పనిసరి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారని, కాలయాపన తోనే మృతి చెందిందన్నారు. వెంటనే ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అఖిల కుటుంబానికి డబుల్‌బెడ్‌రూం ఇల్లు, రూ. 30లక్షల ఎక్స్‌గ్రేషియా, మూడెకరాల భూమి, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేలా ఎమ్మెల్యే, ఎంపీ చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తిప్పారపు వాసు, బోనాసి క్రాంతి, నరేష్, రాకేష్ పాల్గొన్నారు.

● జిల్లా మారినా మారని బోర్డులు





మంచిర్యాల కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడి దాదాపు 10 నెలలు గడుస్తున్నా పలు ప్రభుత్వపాఠశాలలు, కార్యాలయాల బోర్డులు మారలేదు. లక్సెట్టిపేట పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల బోర్డులో పాత జిల్లా పేరు దర్శనమిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఫొటోలు: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్



జన్నారంలో రాస్తారోకో చేస్తున్న పాత్రికేయులు

కడియం తీరుకు నిరసనగా

పాత్రికేయుల రాస్తారోకో

జన్నారం: ఉపముఖ్యమంత్రి కడియం తీరుకు నిరసనగా జన్నారం మండలకేంద్రంలో మంగళవారం పాత్రికేయులు నిరసన తెలిపారు. విలేకరుల సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేసేందుకు ప్రయత్నించగా, అవమానకరంగా మాట్లాడడంతో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల మండల అధ్యక్షుడు నర్సయ్య మాట్లాడుతూ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరికి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించేదుకు వెళ్తే గర్జించి, అవమానించారన్నారు. ఇందుకు నిరసనగా ఈ రాస్తారోకో నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులకు కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, సీపీఎం, సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. సుమారు గంట పాటు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ సంఘటన స్థలానికి చేరుకొని విలేకరులను సముదాయించి, విరమింపజేశారు. మండల అఖిల పక్షం నాయకులు శ్రీనివాస్, రియాజొద్దీన్, తాళ్లపల్లి రాజేశ్వర్, మహేష్, లింగన్న పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అశోక్‌వర్ధన్

కళాశాల భవనాన్ని పూర్తిచేయాలి

దండేపల్లి: దండేపల్లి మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం అసంపూర్తిగా మిగిలిందనీ, భూ సమస్యను పరిష్కరించి, వెంటనే పూర్తిచేయాలని బీజేపీ మంచిర్యాల నియోజకవర్గ కన్వీనర్ ఆకుల అశోక్‌వర్ధన్ డిమాండ్ చేశారు. దండేపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ శివారులో ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కా భవనం నిర్మించగా, ఆ స్థలం కోర్టు వివాదంలో చిక్కుడంతో అసంపూర్తిగా మిగిలిందన్నారు. భూ సమస్య పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. దీంతో కళాశాల విద్యార్థులు, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారనీ, అక్కడ గదుల కొరత వల్ల చెట్ల కింద, వరండాల్లో, రేకులషెడ్డులో పాఠాలు వింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని డిమాండ్ చేశారు. దండేపల్లి బీసీ వసతి గృహానికి పక్కాభవనం నిర్మించాలనీ, ఇందుకు సంబంధించి భూమి కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు స్వామిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జైపాల్‌రెడ్డి, అన్నం శివప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షులు బోడకుంటి వెంకటేశ్, నాయకులు వెంకటేష్, ప్రమోద్ పాల్గొన్నారు.

'గాయపడ్డ కార్మికున్ని నిర్లక్ష్యం చేస్తారా?'

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఆర్కెన్యూటెక్ గనిలో పైకప్పు కూలి గాయపడిన కోల్‌కట్టర్ కనవేని మల్లయ్యను ఏరియా ఆసుపత్రికి తరలించినప్పటికీ అక్కడి వైద్యాధికారులు పట్టించుకోలేదని సింగరేణి కార్మిక బిడ్డల సంఘం(ఎస్‌కేబీఎస్)రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ళ నరేష్ ఆరోపించారు. మంగళవారం సాయంత్రం ఆయన శ్రీరాంపూర్ విలేకరులతో మాట్లాడారు. కార్మికుడు గాయపడి ఆసుపత్రిలో చేరితే కనీసం గనికి సంబంధించిన ఒక్క అధికారి కూడా వెళ్లి వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోలేదన్నారు. కార్మికుని కుటుంబ సభ్యులు పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోలేదన్నారు. మెరుగైన వైద్యం కోసం మల్లయ్యను కార్పొరేట్ ఆసుపత్రికి తరలించాలని కోరారు. లేకపోతే కుటుంబ సభ్యులతో పాటు తాము గని వద్ద నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతామని ఘనంగా ప్రకటిస్తున్న ప్రభుత్వ పెద్దల మాటలు, ఆచరణలో కనిపించడం లేదు. ఇందుకు కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని చింతలమానెపల్లి ప్రభుత్వ పాఠశాలే ఉదాహరణ. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరుకోగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు క్షణక్షణం భయం గుప్పిట్లో కాలం వెల్లదీయాల్సి వస్తున్నది.

◆ చింతలమానెపల్లి

క్షణక్షణం.. భయం భయం..

- శిథిలావస్థలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం
- ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల

● శిథిలావస్థకు పాఠశాల

చింతలమానెపల్లి ప్రభుత్వ ఉన్నతపాఠశాల శిథిలావస్థకు చేరింది. ఇక్కడ 6 నుంచి పదోతరగతి వరకు సుమారు 250 మంది విద్యార్థులు చదువుతున్నా, ఆమేరకు వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. కేవలం అయిదు గదులు మాత్రమే అందుబాటులో ఉండగా, అందులో రెండింటి పరిస్థితి నేడో, రేపో అన్నట్లుగా ఉన్నది. మరోగదిని స్టాఫ్‌రూం, పాఠశాల రికార్డుల కోసం కేటాయించారు. దీంతో మిగిలిన రెండు గదుల్లోనే విద్యార్థులు చదువుతున్నారు. పదోతరగతి విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని వారికి ప్రత్యేకంగా గది కేటాయించడంతో కొన్ని తరగతులకు చెట్ల కింద బోధించాల్సిన దుస్థితి ఉంది. వర్షం వస్తే చదువులకు తీవ్ర ఆటంకం కలుగుతున్నది. మధ్యాహ్న భోజనానికి ఒక రేకుల షెడ్డు ఏర్పాటు చేయగా, అది గాలికి కొట్టుకపోయింది.

● ప్రాథమిక పాఠశాలే దిక్కు..

పదోతరగతి విద్యార్థులకు డిజిటల్ పాఠాలు చెప్పాల్సి రావడంతో పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలను ఉపయోగించుకుంటున్నారు. ఇప్పుడు అందులోనూ అంగన్‌వాడీ కేంద్రం నడుస్తుండడంతో వారికి సైతం గదుల కొరత ఏర్పడింది. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్ దేవాజీ పలుమార్లు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు.

● అధ్వాన స్థితిలో మరుగుదొడ్లు..

భవన పరిస్థితి ఇలా ఉంటే పాఠశాలలోని మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా పనికిరాకుండా పోయాయి. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం బయట బోరు దగ్గరికి వచ్చి ప్లేట్లు, చేతులు కడుక్కుంటున్నారు. నీటి వసతి కూడా సరిగ్గా లేకపోవడంతో నానాపాట్లు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చినప్పుడల్లా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.


కురుస్తున్న పై కప్పు


పెచ్చులూడు తున్న పైకప్పు

భయంభయంగా చదువుకుంటున్నాం

- గోలెం కావేరి, 6వ తరగతి విద్యార్థిని



పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండడంతో ఎప్పుడు కూలుతుందోనని భయమేస్తోంది. గదులు సరిపోకపోవడంతో సార్లు చెట్ల కిందనే పాఠాలు చెబుతున్నారు. ఎదురుగా రోడ్డు ఉండడంతో వచ్చి పోయే వాహనాల శబ్దాలకు పాఠాలు అర్థం కావడం లేదు.

అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి..

- ఎల్కరి మాధవి, పదోతరగతి విద్యార్థిని



అధికారులు వెంటనే స్పందించి ఇక్కడి సమస్యలను పరిష్కరించాలి. ఇరుకు గదులతో తీవ్ర ఇబ్బందుల పాలువుతున్నాం. వర్షం వచ్చినప్పుడల్లా పాఠాలు సరిగ్గా వినలేక పోతున్నాం. మండల కేంద్రంలోని పాఠశాల ఇలాంటి పరిస్థితి ఉండడం ఘోరం. మమ్ములను పాఠశాలకు పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. తప్పని సరి పరిస్థితుల్లో వచ్చి చదువుకుంటున్నాం.

సమస్యలు పరిష్కారిస్తాం ..

- సోమయ్య, ఇన్‌చార్జి ఎంఈఓ



పాఠశాలలో గదుల కొరత ఉంది. ఉన్న భవనం శిథిలావస్థలో ఉండంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం మా దృష్టికి వచ్చింది. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

జూదంలా పత్తిసాగు

బోథ్: పత్తిసాగు జూదంలా తయారైంది. ఓవైపు చీడపీడలు, మరోవైపు అడవి పందులు అన్నదాతలను అతలాకుతలం చేస్తున్నాయి. పూతకు ముందే పురుగుల ఉధృతితో ఈ ఏడాది దిగుబడులపై గుబులు మొదలైంది. పెట్టుబడులు తిరిగిరావడం సంగతేమోగానీ అప్పుల ఊబిలో కూరుకుపోకుంటే చాలనే పరిస్థితి నెలక్నొది.

- ఓ వైపు చీడపీడలు.. మరో వైపు అడవిపందులు
- అతలాకుతలమవుతున్న అన్నదాతలు

ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం పరిధిలోని తొమ్మిది మండలాల్లో 70 వేల హెక్టార్లలో రైతులు పత్తి సాగుచేస్తున్నారు. కోట్లాది రూపాయల పెట్టుబడులు నేలపై పోసి, కలవరపడుతున్నారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు చీడపీడలు అధికమయ్యాయి. వేలాది ఎకరాలపై పారావిల్ట్ రోగం ప్రభావం చూపుతున్నది. మొక్కలు పూర్తిగా చచ్చిపోతున్నాయి. ఇతరత్రా చీడపీలకూ లెక్కలేదు. దీంతో తాహతుకు మించి నిత్యం పురుగుల మందులు పిచికారీ చేస్తున్నారు. ప్రస్తుతం పత్తి పంట పూత కాత దశలో ఉండడంతో అడవిపందుల వాడి ఉధృతమైంది. గతంలో కేవలం అటవీ సమీప ప్రాంతాల్లోనే వీటి సంచారం ఉండేది. ప్రస్తుతం ఇవి మైదాన ప్రాంతానికీ విస్తరించాయి. రాత్రి, పగలు తేడాలేకుండా ఎకరాల కొద్దీ పంటలను నాశనం చేస్తున్నాయి. వీటిని చంపితే అటవీ శాఖ అధికారులు కేసులు నమోదు చేస్తుండడంతో రైతులకు ఏమి చేయాలో పాలుపోవడం లేదు. దీంతో ఈ ఏడాది పెట్టుబడులు తిరిగిరావడం అనుమానంగానే కనిపిస్తున్నది.

అడవి జంతువులతో తీరని నష్టం

- లక్ష్మీకాంత్ పటేల్, రైతు, చింతలబోరి



జిల్లాలో అడవి పందుల సంతతి వేగంగా వృద్ధి చెందుతున్నది. ఒకప్పుడు అటవీ ప్రాంత గ్రామాల్లోనే ఈ సమస్య ఉండేది. ఇప్పుడవి మైదాన ప్రాంతాల్లోకి చేరి, వేలాది ఎకరాల్లో పంటలను నాశనం చేస్తున్నాయి. వాటిని ఎలా అడ్డుకోవాలో అర్థం కావడంలేదు. అటవీ శాఖ అధికారులు అడవి జంతువుల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి.


ఎండిపోతున్న పత్తి మొక్కలు


పారావిల్ట్ బారినపడ్డ పత్తి పంట

ఆకుపచ్చని హాస్టల్..

దండేపల్లి: దండేపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహం పచ్చదనంతో కళకళలాడుతున్నది. ఈ హాస్టల్ పరిశుభ్రతకూ కేరాఫ్ అడ్రస్‌లా మారింది. హరితహారంలో భాగంగా ఏడాది కింద విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షిస్తుండడం వల్లే ఆహ్లాదం పంచుతున్నది.

- కళకళలాడుతున్న ఎస్సీ వసతి గృహం

● ఎటు చూసినా పచ్చదనమే..

ఎస్సీ వసతి గృహంలోని వరండా, ఆవరణలో ఎటు చూసినా పచ్చని మొక్కలు దర్శనమిస్తున్నాయి. గదుల మధ్యలో ఖాళీ ప్రదేశం ఉండగా, జెండా గద్దె చుట్టూ ఉద్యానవంలా తీర్చిదిద్దారు. వరండా చుట్టూ మూడు వైపులా మొక్కలు నాటారు. ఫలితంగా ఎటు నుంచి చూసినా కనువిందుచేస్తున్నాయి. హాస్టల్‌లో గతంలో చదువుకున్న విద్యార్థులు ఈ మొక్కలను నాటగా, ప్రస్తుత విద్యార్థులు నీరు పోసి సంరక్షిస్తున్నారు.


వసతిగృహం ఎదుట వరుస క్రమంలో నాటిన మొక్కలు




దండేపల్లిలోని ఎస్సీ వసతిగృహంలో పచ్చని చెట్లు

మొక్కల పెంపకంతో మానసిక ప్రశాంతత..

- రవీందర్‌గౌడ్, ఎస్సీ హస్టల్ వార్డెన్, దండేపల్లి



మొక్కల పెంపకంతో మానసిక ప్రశాంతత చేకూరుతుంది. అందుకే ఆవరణలో మొక్కలు నాటించాం. వసతి గృహ విద్యార్థులు రోజూ ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరు పోసి కాపాడుతున్నారు. ఈ ఘనత వారికే దక్కుతుంది.

వంతులవారీగా నీళ్లు..

-మియ్యాఖాన్,ఎస్సీ హాస్టల్ వాచ్‌మెన్, దండేపల్లి



వసతి గృహంలో గతంలో మొక్కలు నాటినం. ప్రస్తుతం హరితహారం కింద మరికొన్ని మొక్కలను పెంచుతున్నాం. వసతి గృహ విద్యార్థులు వీటిని దత్తత తీసుకున్నారు. ప్రతిరోజూ వంతులవారీగా నీళ్ల పోసికాపాడుతున్నారు.

‘భిన్న పరీక్ష’ నుంచి కచ్చితంగా ప్రశ్నలు

భిన్న పరీక్ష

ప్రస్తుత పోటీ పరీక్షల్లో భిన్న పరీక్ష విభాగానికి సంబంధించిన ప్రశ్నలు రెండు లేదా మూడు తప్పనిసరిగా ఉంటున్నాయి. ఎస్ఐ తదితర పరీక్షల్లో ఈ విభాగం నుంచి 8 లేదా 10 ప్రశ్నలు కచ్చితంగా వస్తున్నాయి. కాబట్టి రీజనింగ్‌లో ఈ టాపిక్ చాలా ముఖ్యమైంది. ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో నాలుగు లేదా ఐదు పదాలు/ పదాల జతలు / సంఖ్యలు/ వర్ణమాల అక్షరాల సమూహాలను ఇస్తారు. ప్రశ్న & సమాధానాలుగా ఇచ్చే ఎ, బి, సి, డిల్లో ఒకటి మినహా మిగిలినవన్నీ ఒకే లక్షణంతో ఉంటాయి. ఆ విధంగా భిన్నంగా ఉండే పదం/ పదాల జత/ సంఖ్య/ వర్ణమాల అక్షరాల సమూహాన్ని సమాధానంగా గుర్తించాలి. అంటే ఇచ్చిన ఎ, బి, సి, డిల్లో భిన్నంగా ఉన్న దానిని తొలగించాలి.

ఈ విభాగంలో మూడు మోడల్స్ ఉన్నాయి. అవి..

1. పదాలతో భిన్న పరీక్ష
2. భిన్నమైన సంఖ్యను కనుక్కోవడం
3. భిన్నమైన వర్ణమాల అక్షరాల సమూహాన్ని గుర్తించడం

మోడల్ - 1
పదాలతో భిన్న పరీక్ష

ఇందులో రెండు రకాలు ఉన్నాయి. అవి..

టైప్ 1: నాలుగు పదాలు ఇచ్చి భిన్నమైన దానిని సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 2: నాలుగు పదాల జతలను ఇచ్చి భిన్నమైన జతను సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 1

1. ఎ) భరతనాట్యం బి) కూచిపూడి సి) భాంగ్రా డి) యక్షగానం
సమాధానం: **సి**
వివరణ: భాంగ్రా మినహా మిగిలినవన్నీ శాస్త్రీయ నృత్యాలు. భాంగ్రా జానపద నృత్యం.

2. ఎ) అక్టోబరు బి) నవంబరు సి) డిసెంబరు డి) జనవరి
సమాధానం: **బి**
వివరణ: నవంబరు మినహా మిగిలిన నెలలకు నెలకు రోజులు 31. కానీ, నవంబరు నెలలో 30 రోజులు మాత్రమే ఉంటాయి.

3. ఎ) ముఖ్యమంత్రి బి) లోక్‌సభ సభ్యుడు సి) రాజ్యసభ సభ్యుడు డి) ప్రధానమంత్రి
సమాధానం: **ఎ**
వివరణ: ముఖ్యమంత్రి మినహా మిగిలిన వ్యక్తులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన వారు.

4. ఎ) కోహిమా బి) ఇంఫాల్ సి) అగర్తల డి) పట్నా
సమాధానం: **డి**
వివరణ: పట్నా మినహా మిగిలినవన్నీ వివిధ ఈశాన్య రాష్ట్రాల రాజధానులు

5. ఎ) పెల్లాగ్రా బి) బెరిబెరి సి) ఎనీమియా డి) గాయిటర్
సమాధానం: **డి**
వివరణ: గాయిటర్ మినహా మిగిలనవన్నీ విటమిన్ లోపంతో వస్తాయి. కానీ, గాయిటర్ వ్యాధి మాత్రం అయోడిన్ లోపంతో వస్తుంది.

6. ఎ) బ్యాడ్మింటన్ బి) చెస్ సి) క్యారమ్స్ డి) బిలియర్డ్స్
సమాధానం: **ఎ**
వివరణ: బ్యాడ్మింటన్ తప్ప మిగిలినవి ఇండోర్ గేమ్స్

7. ఎ) మే బి) జూన్ సి) జూలై డి) ఆగస్టు
సమాధానం: **బి**
వివరణ: జూన్ మినహా మిగిలిన అన్ని నెలలకు నెలకు 31 రోజులు ఉంటాయి.

8. ఎ) నైల్ బి) ఓల్గా సి) నయాగరా డి) అమెజాన్
సమాధానం: **సి**
వివరణ: నయాగరా మినహా మిగిలినవన్నీ నదుల పేర్లు. నయాగరా అనేది జలపాతం.

9. ఎ) గుండె బి) నేత్రం సి) చెవి డి) కాలు
సమాధానం: **ఎ**
వివరణ: గుండె తప్ప మిగిలినవి జతగా ఉంటాయి.

10. ఎ) నియాసిన్ బి) ట్రిప్సిన్ సి) థయామిన్ డి) రైబోఫ్లోవిన్
సమాధానం: **ఎ**



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

వివరణ: ట్రిప్సిన్ మినహా మిగిలినవన్నీ విటమిన్ పేర్లు. ట్రిప్సిన్ అనేది ఎంజైమ్.

11. ఎ) బంతి బి) చేమంతి సి) తామర డి) గులాబి
సమాధానం: **సి**
వివరణ: తామర మినహా మిగిలిన పువ్వులన్నీ భూమి మీద పెరుగుతాయి. తామర నీటిలో పెరుగుతుంది.

12. ఎ) పోలెండ్ బి) గ్రీస్ సి) స్పెయిన్ డి) కొరియా
సమాధానం: **డి**
వివరణ: కొరియా మినహా మిగిలిన దేశాలు యూరప్ ఖండంలోనివి. కానీ, కొరియా ఆసియా ఖండానికి సంబంధించిన దేశం.

13. ఎ) చెన్నై బి) హైదరాబాద్ సి) బెంగళూరు డి) లక్నో
సమాధానం: **డి**
వివరణ: లక్నో మినహా మిగిలినవన్నీ వివిధ దక్షిణ భారత రాష్ట్రాల రాజధానులు. లక్నో మాత్రం ఉత్తర భారతంలోని రాష్ట్రానికి సంబంధించిన రాజధాని.

14. ఎ) కివి బి) గద్ద సి) పెంగ్విన్ డి) ఆస్ట్రిచ్
సమాధానం: **బి**
వివరణ: గద్ద మినహా మిగిలిన పక్షులు ఎగరలేనివి. గద్ద ఎగిరే పక్షి.

15. ఎ) గోధుమ బి) ఆవాలు సి) వేరుశనగ డి) వరి
సమాధానం: **డి**
వివరణ: వరి మినహా మిగిలినవన్నీ రబీ పంటలు. వరి ఖరీఫ్ పంట

16. ఎ) బైకాల్ బి) ఢాల్ సి) చిలక డి) థార్
సమాధానం: **డి**
వివరణ: థార్ మినహా మిగిలినవన్నీ వివిధ సరస్సుల పేర్లు. థార్ అనేది ఎడారి.

17. ఎ) కోణార్క్ బి) మధురై సి) ఎల్లోరా డి) దిల్వారా
సమాధానం: **సి**
వివరణ: ఎల్లోరా మినహా మిగిలివన్నీ ప్రసిద్ధ దేవాలయాలు ఉన్న ప్రదేశాలు. ఎల్లోరా ప్రసిద్ధ గుహలు ఉన్న ప్రదేశం

18. ఎ) రుగ్వేదం బి) ఆయుర్వేదం సి) సామవేదం డి) యజుర్వేదం
సమాధానం: **బి**
వివరణ: ఆయుర్వేదం మినహా మిగిలినవి వేదాలు. అయుర్వేదం అనేది వైద్య శాస్త్రం.

19. ఎ) గ్రానైట్ బి) లిగ్నైట్ సి) ఆంత్రసైట్ డి) బిటూమినస్
సమాధానం: **ఎ**
వివరణ: గ్రానైట్ మినహా మిగిలినవి బొగ్గు రూపాంతరాలు. గ్రానైట్ అనేది విలువైన రాయి.

20. ఎ) సంతాల్స్ బి) ఖోండ్స్ సి) అబోర్స్ డి) డోగ్రి
సమాధానం: **డి**
వివరణ: డోగ్రి మినహా మిగిలినవన్నీ వివిధ గిరిజన జాతులు. డోగ్రి అనేది ఒక భాష.

21. ఎ) కాలువ బి) వంతెన సి) ప్రవాహం డి) సెలయేరు
సమాధానం: **బి**
వివరణ: వంతెన మినహా మిగిలినవి నీటితో ఉంటాయి.

22. ఎ) నేపాల్ బి) టోక్యో సి) కాబూల్ డి) బీజింగ్
సమాధానం: **ఎ**
వివరణ: నేపాల్ మినహా మిగిలినవి వివిధ దేశాల రాజధానులు. నేపాల్ అనేది ఒక దేశం.

23. ఎ) మహావీరుడు బి) గౌతమబుద్ధుడు సి) మహాత్మాగాంధీ డి) గురునానక్
సమాధానం: **సి**
వివరణ: మహాత్మాగాంధీ మినహా మిగిలిన వారు ప్రసిద్ధ మతాల స్థాపకులు.

24. ఎ) రాజీవ్‌గాంధీ బి) జవహర్‌లాల్ నెహ్రూ సి) చరణ్ సింగ్ డి) బాబూ రాజేంద్రప్రసాద్
సమాధానం: **డి**
వివరణ: బాబూ రాజేంద్రప్రసాద్ మినహా మిగిలినవారు ప్రధానమంత్రులు. బాబూ రాజేంద్ర ప్రసాద్ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారు.

25. ఎ) పాదరసం బి) ఆక్సిజన్ సి) మెగ్నీషియం డి) సోడియం
సమాధానం: **ఎ**
వివరణ: నాలుగూ మూలకాలే. కానీ, పాదరసం ద్రవరూప మూలకం.

26. ఎ) కలం బి) నల్లబల్ల సి) కాగితం డి) పలక
సమాధానం: **ఎ**
వివరణ: కలం మినహా మిగిలిన వాటిపై వివిధ వస్తువులతో రాయవచ్చు. కలం మాత్రం రాయడానికి ఉపయోగించేది.

27. ఎ) గారో బి) ఖాశీ సి) కాంగ్రా డి) జెంతియా
సమాధానం: **సి**
వివరణ: కాంగ్రా మినహా మిగిలినవి కొండలు. కాని, కాంగ్రా లోయ.

28. ఎ) జూన్ బి) సెప్టెంబరు సి) నవంబరు డి) ఆగస్టు
సమాధానం: **డి**
వివరణ: ఆగస్టు మినహా మిగిలిన నెలలకు నెలకు 30 రోజులు ఉంటాయి. ఆగస్టు నెలకు మాత్రం 31 రోజులు ఉంటాయి.

29. ఎ) మార్చి బి) జూలై సి) ఆగస్టు డి) మే
సమాధానం: **సి**
వివరణ: అన్ని నెలలకు 31 రోజులు ఉన్నాయి. మార్చి 3వ నెల, జూలై 7వ నెల, మే 5వ నెల అంటే మార్చి, మే, జూలై బేసి నెలలు. ఆగస్టు అనేది 8వ నెల అంటే సరి సంఖ్యకు సంబంధించిన నెల.

30. ఎ) నారింజ బి) పసుపు సి) ఆకుపచ్చ డి) గులాబి
సమాధానం: **డి**
వివరణ: గులాబీ మినహా మిగిలినవి ఇంద్రధనస్సు రంగుల్లో ఉంటాయి.

31. ఎ) న్యూటన్ బి) మార్కోని సి) బీతావన్ డి) ఫారడే
సమాధానం: **సి**
వివరణ: బీతావన్ మినహా మిగిలిన వ్యక్తులు శాస్త్రవేత్తలు.

32. ఎ) క్యారట్ బి) అల్లం సి) బీట్‌రూట్ డి) ఆనపకాయ
సమాధానం: **డి**
వివరణ: ఆనపకాయ మినహా మిగిలిన కూరగాయలు భూమి నుంచి వస్తాయి.

33. ఎ) గుండె బి) చెవి సి) ముక్కు డి) నేత్రాలు
సమాధానం: **ఎ**
వివరణ: గుండె మినహా మిగిలినవి జ్ఞానేంద్రియాలు.

34. ఎ) బిందుసారుడు బి) బింబిసారుడు సి) అశోకుడు డి) సంప్రాప్తి
సమాధానం: **బి**
వివరణ: బింబిసారుడు మినహా మిగిలిన వ్యక్తులు మౌర్య వంశానికి చెందిన వారు. బింబిసారుడు హర్యంక వంశానికి వ్యక్తి.

35. ఎ) దాద్రానగర్ హవేలి బి) అండమాన్ నికోబార్ దీవులు సి) పాండిచ్చేరి డి) జార్ఖండ్
సమాధానం: **డి**
వివరణ: జార్ఖండ్ మినహా మిగిలినవి కేంద్ర పాలిత ప్రాంతాలు. జార్ఖండ్ అనేది రాష్ట్రం పేరు.

36. ఎ) బుల్లి బి) కార్నర్ సి) బంకర్ డి) డ్రిబుల్
సమాధానం: **సి**
వివరణ: బంకర్ మినహా మిగిలిన పదాలు హాకీ క్రీడకు సంబంధించినవి.

37. ఎ) బీర్బల్ బి) ఫైజ్ అహ్మద్ సి) అబుల్ ఫజిల్ డి) తాన్‌సేన్
సమాధానం: **బి**
వివరణ: ఫైజ్ అహ్మద్ మినహా మిగిలిన వ్యక్తులు అక్బరు ఆస్థానానికి చెందిన వారు.

38. ఎ) ఆసియా బి) అర్జెంటీనా సి) ఆఫ్రికా డి) ఆస్ట్రేలియా
సమాధానం: **బి**
వివరణ: అర్జెంటీనా మినహా మిగిలినవి ఖండాల పేర్లు

39. ఎ) మెరీనా బి) జెర్సోప్పా సి) విక్టోరియా డి) ఏంజెల్
సమాధానం: **ఎ**
వివరణ: మెరీనా మినహా మిగిలినవి జలపాతాలు. మెరీనా అనేది ఒక బీచ్.

JOBS ఉద్యోగాలు

సిడాక్

నోయిడాలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 67

ప్రాజెక్ట్ మేనేజర్ **ఖాళీలు:** 2
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీతో పదకొండేళ్లు/ పీజీతో ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 50 ఏళ్లు మించరాదు

ప్రాజెక్ట్ ఇంజనీర్ **ఖాళీలు:** 65
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం మూడు నుంచి ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 37 ఏళ్లు మించరాదు
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 23
దరఖాస్తు ఫీజు: రూ.500
ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న తరవా త హార్డు కాపీని నిర్దేశిత చిరునామాకు పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 18
చిరునామా: Section in Charge(HR - II), Ce ntre for Development of Advanced Comp uting(CDAC), Academic Block, B - 30, Institutional Area, Sector - 62, Noida - 201307
వెబ్‌సైట్: http://cdac.in/

ఎస్ఎస్‌సి ఎస్ఆర్

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ సదరన్ రీజియన్ (ఎస్ఎస్‌సి ఎస్ఆర్) - కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 66

టెక్నికల్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 3
అర్హత: డిప్లొమా (హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ టెక్నాలజీ) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 30 ఏళ్లు మించరాదు.

వర్క్‌షాప్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 1
అర్హత: బిఇ/ బిటెక్ (మెకానికల్) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 30 ఏళ్లు మించరాదు.

సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ (వీవింగ్) **ఖాళీలు:** 1
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (టెక్స్‌టైల్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ ఇంజ నీరింగ్)/ డిప్లొమా(హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్ టైల్ టెక్నాలజీ/ హ్యాండ్లూమ్ & టెక్స్‌టైల్ టెక్నాలజీ) ఉత్తీర్ణతతోపాటు అనుభవం కూడా ఉండాలి
వయసు: 30 ఏళ్లు మించరాదు.

మెడికల్ అటెండెంట్ **ఖాళీలు:** 34
అర్హత: 10వ తరగతి
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

లేడీ మెడికల్ అటెండెంట్ **ఖాళీలు:** 15
అర్హత: 10వ తరగతితోపాటు ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

కన్జర్వేషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 2
అర్హత: 10వ తరగతితోపాటు డిప్లొమా(సివిల్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

జూనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 9
అర్హత: 10వ తరగతితోపాటు ఐటిఐ సర్టిఫికెట్ (సివిల్ ఇంజనీరింగ్) ఉండాలి
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

ఎవల్యూషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 1
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (స్టాటిస్టిక్స్/ మేథమెటిక్స్/ ఎకనామిక్స్/ సోషియాలజీ/ సోషల్ వర్క్) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 24
దరఖాస్తు హార్డు కాపీ పంపేందుకు చివరి తేదీ: అక్టోబరు 4
వెబ్‌సైట్: www.sscsr.gov.in

రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?

భారత రాష్ట్రపతి

1. భారతదేశ రాజ్యాంగ అధినేత అయిన రాష్ట్రపతి గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో పొందుపరిచారు?
ఎ) మూడో భాగం 12 - 35 ఆర్టికల్
బి) నాలుగో భాగం 36 - 51 ఆర్టికల్
సి) ఐదో భాగం 52 - 62 ఆర్టికల్
డి) ఆరో భాగం 152 - 161 ఆర్టికల్
2. భారతదేశ ప్రథమ పౌరుడు అని ఎవర్ని అంటారు?
ఎ) రాష్ట్రపతి బి) అటార్నీ జనరల్ సి) గవర్నర్
డి) సుప్రీంకోర్టు ప్రధాన నాయ్యమూర్తి
3. భారతదేశానికి ఒక రాష్ట్రపతి ఉంటాడు అని తెలిపే ఆర్టికల్?
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ
4. భారత రాజ్యాంగాన్ని, చట్టాలను సంరక్షించే బాధ్యత ఎవరికి కల్పించారు?
ఎ) పార్లమెంట్ బి) సుప్రీం కోర్టు
సి) ప్రధానమంత్రి డి) రాష్ట్రపతి
5. భారతదేశ సర్వసైన్యాధ్యక్షుడు ఎవరు?
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) సైనిక దళాధిపతి డి) పైవారందరూ
6. కేంద్ర ప్రభుత్వంలో అన్ని కార్యనిర్వాహక సంబంధ, ఒప్పందాలు ఎవరి పేరు మీద జరుగుతాయి?
ఎ) ప్రధానమంత్రి బి) కేంద్ర కేబినెట్
సి) రాష్ట్రపతి డి) కేంద్ర శాసనసభ
7. భారత రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ అధినేత ఎవరు?
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) కేంద్ర మంత్రిమండలి డి) పైవారందరూ
8. రాష్ట్రపతిని ఎవరు ఎన్నుకొంటారు?
ఎ) పార్లమెంట్‌కు ఎన్నికైన ఉభయసభ సభ్యులు
బి) ఎలక్ట్రోరల్ కాలేజ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనసభ సభ్యులు మాత్రమే
డి) పైవారందరూ
9. రాష్ట్రపతి ఎన్నిక, ఎన్నిక విధానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) బ్రిటన్ బి) అమెరికా
సి) ఐర్లాండ్ డి) రష్యా
10. రాష్ట్రపతి ఎన్నిక విధానాలను రాజ్యాంగ పరిషత్తులో ప్రతిపాదించిన వారు?
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
బి) గోపాలస్వామి అయ్యంగార్
సి) బి.ఎన్.రావు డి) కె.ఎం.మున్షీ
11. భారత రాష్ట్రపతిని ఏ దేశ రాజు లేదా రాణితో పోలుస్తారు?
ఎ) బ్రిటన్ బి) నేపాల్ సి) భూటాన్ డి) ఫ్రాన్స్
12. రాష్ట్రపతి ఎన్నిక విధానం గురించి రాజ్యాంగంలోని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ
13. రాష్ట్రపతి ఎవరి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేస్తారు?
ఎ) ఉపరాష్ట్రపతి బి) లోక్‌సభ స్పీకర్
సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
డి) ఎవరూ కాదు
14. రాష్ట్రపతి పదవికి పోటీ చేసే వ్యక్తి కనీస వయసు?
ఎ) 30 ఏళ్లు నిండి ఉండాలి
బి) 31 ఏళ్లు నిండి ఉండాలి
సి) 33 ఏళ్లు నిండి ఉండాలి
డి) 35 ఏళ్లు నిండి ఉండాలి
15. రాజ్యాంగంలో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఢిల్లీ, పాండిచ్చేరి (కేంద్ర పాలిత ప్రాంతాలు) రాష్ట్రపతి ఎన్నికల్లో పాలుపంచుకొంటున్నాయి?
ఎ) 1992, 70వ రాజ్యాంగ సవరణ
బి) 1992, 73వ రాజ్యాంగ సవరణ
సి) 1992, 74వ రాజ్యాంగ సవరణ
డి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
16. షెడ్యూల్డ్ కులాలను నిర్ణయించే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) పార్లమెంట్ బి) రాష్ట్రపతి
సి) జాతీయ ఎస్సీ కమిషన్
డి) కేంద్రమంత్రి మండలి
17. పార్లమెంట్ సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) కేంద్ర ఎన్నికల సంఘం
బి) సభాధ్యక్షుడు
సి) రాష్ట్రపతి డి) సుప్రీం కోర్టు
18. రాష్ట్రపతి పదవీకాలం?
ఎ) నాలుగు సంవత్సరాలు
బి) ఐదు సంవత్సరాలు
సి) ఆరు సంవత్సరాలు డి) ఏదీకాదు
19. రాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ఎవరు వ్యవహరిస్తారు?
ఎ) ఎన్నికల అధికారి బి) కలెక్టర్
సి) లోక్‌సభ సెక్రటరీ జనరల్ డి) లోక్‌సభ స్పీకర్



కొమ్ము సుందర్‌రాజు
